**నేటి కందం- నేటికి అందం**

కాలాంతరమున నిలిచెడి
హేలగ రేవంత రెడ్డి హృషితాత్ముండై
కాళేశ్వరమున గల దే
వాలయమున క్రొత్త పనులు ప్రారంభించెన్ !!

(200 కోట్ల రూపాయలతో కాళేశ్వర దేవాలయం అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

మాటల యుద్ధంలో
మాంత్రికులే ఇద్దరు
విజయాలు మూటగట్టి
విప్పుతుంద్రు చెద్దరు.
ప్రభుత్వం రావాలి
పోవాలనే నినాదాలు
ప్రజలే కదా తేల్చేది
పనితనం విధానాలు.

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 22-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:197 పేజీలు:6 వెల: రూ.1/-


## కేరళలో భారీ పేలుడు..
# ఆరుగురు దుర్మరణం
### 40 మందికి గాయాలు



కేరళ, ఏప్రిల్, ఏప్రిల్ 21: తమిళనాడు విరుదునగర్‌లోని బాణసంచాలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాద ఘటన మరువక ముందే.. కేరళలో మరో విషాదం నెలకొంది. త్రిస్సూర్‌లోని ఓ బాణసంచా ఉత్పత్తి కేంద్రంలో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలవురు మృతిచెందారు. మరో 40 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

త్రిస్సూర్ తిరువంబడిలోని ఓ బాణసంచా తయారీ యూనిట్లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 24న జరగాల్సిన నమూనా బాణసంచా కోసం ఆ కేంద్రంలో సామగ్రిని ఉత్పత్తి చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో ఆ శబ్దం సుమారు కొన్ని కిలోమీటర్ల మేర వినిపించినట్టు స్థానికులు తెలిపారు. తొలుత దీన్ని భూప్రకంపనలుగా భావించినట్టు వారు తెలిపారు. పేలుడు అనంతరం ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. అయితే.. నల్లటి పొగలు, మరోసారి పేలుడు సంభవించిన కారణంగా సహాయక చర్యలు కష్టతరంగా మారాయని అక్కడి అధికారులు వెల్లడించారు. ఆ యూనిట్లో పేలని బాణసంచా పదార్థాలు ఇంకా ఉన్నాయనే అనుమానంతో.. అత్యంత జాగ్రత్తగా సహాయక కార్యకలాపాలు సాగుతున్నాయి. పేలుడుకు గల కచ్చితమైన కారణాలేమిటో ఇంకా తెలియరాలేదు.

# ఆర్నెళ్లలో గోర్కా సమస్యను పరిష్కరిస్తాం
### - బెంగాల్‌లో అమిత్ షా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:ఒకవేళ పశ్చిమ బెంగాల్‌లో తమ పార్టీ అధికారంలోకి వస్తే, దశాబ్దాల కాలం నాటి గుర్కా సమస్యను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా(ంఎతిబి రాష్ట్రజీష్ట్ర) పేర్కొన్నారు. బీజేపీ ఒక్కటే గోర్కా సమస్యను పరిష్కరించగలదని, మరే పార్టీ కూడా ఆ సమస్యను పరిష్కరించలేదన్నారు. డార్జిలింగ్ జిల్లాలోని కుర్సియాంగ్‌లో జరిగిన ఎన్నికల సభలో మంత్రి షా మాట్లాడారు. గోర్కాల మనోభావాలను, ఆందోళనలను బీజేపీ మాత్రమే అర్థం చేసుకోగలదని, వారికి తగినట్లే ఆ సమస్యను పరిష్కరించగలమని అమిత్ షా తెలిపారు.

తమ ప్రభుత్వం ఏర్పడిన ఆర్నెళ్లలోనే గోర్కాల ముఖంలో ఆనందాన్ని చూడవచ్చు అన్నారు. గోర్కాల సమస్యకు పరిష్కారాన్ని గుర్తిస్తామని, గోర్కాలు శాంతియుతంగా జీవించవచ్చు అన్నారు. ఉత్తర బెంగాల్‌లో ఉన్న కొండ ప్రాంతాల్లో ఎక్కువగా గోర్కా వర్గ ప్రజలు నివసిస్తుంటారు. అయితే తమ సమస్యలు పరిష్కరించాలని ఆ కమ్యూనిటీ కొన్ని దశాబ్దాలు నుంచి పోరాడుతూనే ఉన్నది.

కేంద్ర మంత్రి అమిత్ షా తన ప్రసంగంలో ఎక్కడా నేరుగా గోర్కాల్యాండ్ కానీ ప్రత్యేక రాష్ట్రం గురించి కానీ ప్రస్తావించలేదు. కానీ డార్జిలింగ్ లోక్‌సభ స్థానం ప్రస్తుతం బీజేపీ ఆధీనంలో ఉన్నది. 2009 నుంచి అక్కడ ఆ పార్టీయే గెలుస్తోంది.

# బీఆర్ఎస్ కీలక సమావేశం..
### -కేసీఆర్ అధ్యక్షతన రజతోత్సవ ముగింపు వేడుకలు



హైదరాబాద్, ఏప్రిల్ 21:భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ రజతోత్సవ సంబురాల ముగింపును పురస్కరించుకుని ఈ నెల 27న తెలంగాణ భవన్‌లో ఒక ప్రత్యేక సమావేశం జరగనుంది. మధ్యాహ్నాం 2 గంటలకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరగనున్న ఈ భేటీకి రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణ, సభ్యత్వాల పునరుద్ధరణతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించనున్నారు.

ఈ ప్రతిష్టాత్మక సమావేశానికి పార్టీ ముఖ్య నేతలందరికీ అధిష్టానం నుంచి పిలుపు అందింది. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, పార్లమెంటు సభ్యులు (ఎంపీలు), శాసనమండలి (ఎమ్మెల్సీ), శాసనసభ (ఎమ్మెల్యే) సభ్యులతో పాటు మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్లను ఈ సమావేశానికి ఆహ్వానించారు. పార్టీ శ్రేణులకు భవిష్యత్ దిశానిర్దేశం చేసేందుకు ఈ భేటీ కీలకం కానుంది.

# ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 21: తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే అంశంలో కొంత జాప్యం జరగవచ్చని తెలిపారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన అన్ని అంశాలను పరిశీలించడానికి నలుగురు అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసిందని ప్రస్తావించారు. ఆర్టీసీ ప్రతినిధులంతా ఆ కమిటీకి కార్మికుల సమస్యలు విన్నవిస్తే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తాను అధికారుల దగ్గర చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు.

ఉద్యోగులుగా మీారు.. ప్రభుత్వంగా తాము కలిసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌలభ్యం చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఎలాంటి భేషజాలకు పోకుండా అధికారుల కమిటీకి ఉద్యోగుల సమస్యలు విన్నవించాలని సూచించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు..**

మరోవైపు.. టీజీఎస్ ఆర్టీసీకి సంబంధించిన సమస్యలను పరిశీలించడానికి అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీఓఎంఎస్ నంబర్ 66ను విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ఉద్యోగుల నుంచి, వారి సేవా నిబంధనలు, సంబంధిత విషయాలపై పలు సమస్యలను లేవనెత్తుతూ ప్రభుత్వానికి వినతులు అందుతున్నాయి. ఈ వినతులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు లేవనెత్తిన సమస్యలను పరిశీలించి, తగిన సిఫార్సులను సూచించడానికి ప్రభుత్వం అధికారుల కమిటీని ఏర్పాటు చేసింది.

# భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ సాకారం: మంత్రి పొంగులేటి



ఖమ్మం, ఏప్రిల్ 21: భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ సాకారమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ జరిగిందని పేర్కొన్నారు. భూభారతి పోర్టల్‌తో భూమి హక్కులకు శాశ్వత భరోసా కల్పించామని చెప్పుకొచ్చారు. ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధన ఉంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. భూభారతి పోర్టల్ రైతులకు భద్రత, కుటుంబాలకు నమ్మకమని తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెవెన్యూ సంస్కరణలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. ఐదు మండలాల్లో పైలట్‌గా భూభారతి అమలవుతోందని చెప్పుకొచ్చారు. ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకొచ్చామని తెలిపారు. దేశానికి ఆదర్శంగా భూభారతి పోర్టల్ ఉంటుందని వ్యాఖ్యానించారు. కూసుమంచిలో చారిత్రాత్మకంగా తొలి నమోదు చేశామని వివరించారు. రైతు భూమి హక్కులకు ఓ స్పష్టత ఇచ్చామని.. సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పుకొచ్చారు. సర్వే మ్యాప్‌తో యాజమాన్యంపై ఎలాంటి సందేహం లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. ఆధునాతన టెక్నాలజీతో ఖచ్చితమైన భూసర్వేలు చేపడతామని.. దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# వీధి కుక్కల దాడులపై హెచ్ఆర్సీ సీరియస్

హైదరాబాద్, ఏప్రిల్ 21: వీధి కుక్కల దాడిలో చిన్నారి మరణించిన ఘటనపై హెచ్ఆర్సీ సీరియస్ అయింది. రెండు ఘటనలపై సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఆంధ్రజ్యోతి న్యూస్ పేపర్‌లో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకొని సుమోటోగా ఈ కేసు విచారణకు స్వీకరించింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో మూడేళ్ల బాలిక దివ్య బేహారాను పంట పొలాల్లోకి వీధి కుక్కలు లాకెళ్లి పీక్కుతున్నాయని హెచ్ఆర్సీ ఆవేదన వ్యక్తం చేసింది. దివ్య బేహారాపై విచక్షణ రహితంగా కుక్కలు దాడి చేయడంతో మృతి చెందిందని ప్రస్తావించింది.

మరో ఘటనలో యాదాద్రి భువనగిరి జిల్లాలో నాగరాజు అనే మరో వ్యక్తిపై వీధికుక్కలు దాడి చేశాయని హెచ్ఆర్సీ వెల్లడించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం.. వ్యక్తులకు జీవించే హక్కు ఉల్లంఘన జరిగిందని తెలిపింది. ఈ ఘటనల్లో సంబంధిత స్థానిక అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్లు ప్రాథమికంగా భావించింది. ప్రజల భద్రత, వలస కార్మికుల పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనలపై వాస్తవ పరిస్థితులు, తీసుకున్న చర్యల వివరాలను నివేదిక సమర్పించాలని పెదపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్లకు మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 2వ తేదీకి హెచ్ఆర్సీ వాయిదా వేసింది.

# మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధుల కీలక భేటీ



హైదరాబాద్, ఏప్రిల్ 21:తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు ఈరోజు (మంగళవారం) సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ?నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు.

లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, క్లైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ?నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.

# అమెజాన్ డెలివరీలో భారీ మోసం..
### -ఢిల్లీ పోలీసుల వేటలో దొరికిన కేటుగాళ్లు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ పేరుతో జరిగిన ఒక భారీ ఆన్‌లైన్ మోసాన్ని ఢిల్లీ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఆర్డర్ చేసిన వస్తువులను కస్టమర్‌కు చేరకుండానే 'డెలివరీ' అయినట్లు చూపిస్తూ, సుమారు రూ. 35 లక్షల విలువైన ఐఫోన్లను పక్కదారి పట్టించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీలోని శాస్త్రి నగర్‌కు చెందిన సుమిత్ అగర్వాల్ అనే వ్యక్తి ఏప్రిల్ 12 నుంచి 16వ తేదీ మధ్య అమెజాన్ ద్వారా మొత్తం 50 ఐఫోన్ 16 (128 జీబి) ఫోన్లను ఆర్డర్ చేశారు.

అయితే అమెజాన్ యాప్‌లో అన్ని ఫోన్లు సక్సెస్‌ఫుల్‌గా "డెలివరీ" అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. కానీ, సుమిత్‌కు ఒక్క ఫోన్ కూడా అందలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, రూ. ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న భరత్ నగర్ పోలీసులు ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేపట్టారు. డెలివరీ ప్రక్రియలోనే లోపం ఉందని గుర్తించిన పోలీసులు, డెలివరీ ఏజెంట్లపై దృష్టి సారించారు. అమెజాన్ డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తున్న జస్‌ప్రీత్ సింగ్ (21) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

జస్‌ప్రీత్ స్నేహితుడు హిమాన్షు (30) ఇద్దరూ కలిసి సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఈ ప్లాన్ వేసినట్లు తేలింది. ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 14 సీల్డ్ ఐఫోన్ 16 యూనిట్లను స్వాధీనం చేసుకున్నారు.

వీటి విలువ సుమారు రూ. 10 లక్షలుగా ఉంటుందని పోలీసులు వెల్లడించారు,

# ఇరాన్‌తో చర్చలకు రమ్మంటే వస్తా: డొనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల నేపథ్యంలో ఓ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరాన్ నాయకత్వంతో నేరుగా సంప్రదింపులు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచనప్రాయంగా పేర్కొన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ట్రంప్.. ఇరాన్‌తో శాంతి చర్చల గురించి మాట్లాడారు

'వారు కలవాలనుకుంటే.. మా దగ్గర చాలా మంది సమర్థులైన వ్యక్తులు ఉన్నారు. ఒకవేళ వారు నేరుగా నన్నే కలవాలనుకున్నా నాకు అభ్యంతరం లేదు. ఇరాన్ నేతలను కలిసి శాంతి చర్చల గురించి మాట్లాడేం దుకు నేను సిద్ధమే' అని ట్రంప్ ప్రకటించారు. నేరుగా కాకపోయినా వర్చువల్‌గా అయినా ట్రంప్ పాల్గొనే అవకాశం ఉన్నట్టు సమాచారం. కాగా, ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించే అవకాశం ఉందని అమెరికా మాజీ సీఐఏ చీఫ్ డేవిడ్ హెచ్ పెట్రయాస్ అభిప్రాయపడ్డారు

కాగా, పాకిస్థాన్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య రెండో దఫా శాంతి చర్చలు జరుగుతాయా, లేదా అనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమపై బెదిరింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో.. వారితో చర్చలకు అంగీకరించే ప్రసక్తే లేదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ అన్నారు.

# మోదీపై.. ఖర్గే 'ఉగ్రవాది' వ్యాఖ్యలు దురదృష్టకరం: కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 21:ప్రధానమంత్రి నరేంద్రమోదీని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉగ్రవాది (టెర్రరిస్ట్) అని సంబోధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఓ జాతీయ పార్టీ అధ్యక్షుడిగా, సుదీర్ఘ రాజకీయ అనుభవం గల నాయకుడిగా ఖర్గేకు పేరు ఉందని ప్రస్తావించారు. బాధ్యాతాయుతమైన ప్రధానమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై.. ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని తెలిపారు. ఖర్గే.. మోదీపై పదే పదే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుండటం.. ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని బట్టబయలు చేస్తోందని విమర్శించారు. ఉగ్రవాదాన్ని అణచివేయడంలో అహోరాత్రులు శ్రమిస్తున్న మోదీని ఉగ్రవాదిగా సంబోధించే ముందు.. ఉగ్రవాదులతో కాంగ్రెస్ నాయకులు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన విషయాన్ని మల్లికార్జున ఖర్గే గుర్తుపెట్టుకుంటే బాగుండేదని ఎద్దేవా చేశారు.

డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో.. కశ్మీర్ వేర్పాటువాద ఉగ్రవాది యాసిన్ మాలిక్‌తో చర్చలు జరిపిన విషయం ఖర్గేకు గుర్తులేదా.. అని ప్రశ్నించారు. ప్రధానిని ఉద్దేశించి మాట్లాడుతున్నప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలు మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. రాజకీయాల్లో మరీముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమని.. కానీ ఈ ప్రయత్నంలో వ్యక్తిగత దూషణలకు చోటులేదని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలోనూ కావాల్సినంత విషం కక్కారని ఆగ్రహించారు. ఎన్నికల ప్రచారంలో మహిళలు తమను ద్వేషిస్తున్నారని తెలిసి ఆవేదనతో, ఆక్రోశంతో ప్రధానమంత్రి మీద ఇలాంటి విమర్శలు చేయడం సరికాదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవద్దు..!

## (ఏప్రిల్ 22న "అంతర్జాతీయ (ప్రపంచ) భూమాత దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచంలోనే అతిపెద్ద పర్యావరణ ఉద్యమమైన అంతర్జాతీయ (ప్రపంచ) భూమాత దినోత్సవం, భూమిని, దాని ఆవరణ వ్యవస్థలను మానవాళి ఉమ్మడి నివాసంగా గుర్తిస్తుంది. ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడానికి, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, జీవవైవిధ్య పతనాన్ని ఆపడానికి, దానిని రక్షించాల్సిన అవసరాన్ని ఇది నొక్కి చెబుతుంది. వాతావరణ మార్పులు, ప్రకృతిలో మానవ ప్రమేయ మార్పులు, అలాగే అడవుల నరికివేత, భూ వినియోగ మార్పులు, తీవ్రమైన వ్యవసాయం, పశు పోషణ, పెరుగుతున్న అక్రమ వన్యప్రాణుల వ్యాపారం వంటి జీవ వైవిధ్యానికి భంగం కలిగించే అంశాలు మన గ్రహం యొక్క వినాశన వేగాన్ని పెంచుతున్నాయి. మన భూ గ్రహం కేవలం ఒక నివాస స్థలమే మాత్రమే కాదు – అది జీవాన్ని నిలబెట్టే ఒక చైతన్యవంతమైన, పరస్పరం అనుసంధానించబడిన వ్యవస్థ. భూమి సమస్త జీవాలకు అవసరమైన వనరులను అందిస్తుంది, వాతావరణాన్ని నియంత్రిస్తుంది, జీవ వైవిధ్యాన్ని పెంపొందిస్తుంది. శ్వాస తీసుకోవడానికి సారవంతమైన గాలిని, తాగడానికి స్వచ్ఛమైన నీటిని, ఆవాస నివసించడానికి, వ్యవసాయ సాగు చేయడానికి సారవంతమైన భూమిని అందిస్తుంది.

ప్రపంచ భూమి దినోత్సవం – 2026 యొక్క ఇతివృత్తం:

ఈ అద్భుతమైన గ్రహం యొక్క సహజ సౌందర్యాన్ని ప్రభావితం చేస్తున్న వివిధ తీవ్రమైన పర్యావరణ సమస్యల కారణంగా, ఆరోగ్యకరమైన జీవరాశి, ముఖ్యంగా మానవాళి మనుగడ కోసం పవిత్రమైన భూమాతను పరిరక్షించేందుకు, 1970లో తొలిసారిగా ప్రారంభించబడిన (2009లో ఐక్యరాజ్యసమితిచే గుర్తింపు పొందిన) 56వ అంతర్జాతీయ భూమాత దినోత్సవాన్ని లేదా ప్రపంచ భూ దినోత్సవాన్ని ప్రపంచ మానవాళి 2026 ఏప్రిల్ 22న ప్రతి ఏటా నిర్వహిస్తోంది. ప్రపంచ భూ దినోత్సవం–2026 యొక్క ఇతివృత్తం "మన శక్తి, మన గ్రహం". కంపెనీలు, ప్రభుత్వాలు, సమాజాలు, పౌరులతో సహా అందరూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి, నిర్ణయాలు అమలు చేయడానికి ఒక ప్రపంచ కూటమిని పటిష్టం చేయాలని లక్షలాది మంది ప్రజలకు గుర్తుచేయడమే దీని ఉద్దేశ్యం. భూమాత మన ఇల్లు, దానిని రక్షించడం మన కనీస బాధ్యత అని గమనించాలి.

### తరతరాలను కాపాడటానికి భూమిని కాపాడండి:

ప్రపంచ భూమి దినోత్సవం సందర్భంగా, వాతావరణ/పర్యావరణ అక్షరాస్యతను ప్రోత్సహిద్దాం. హరిత ఉద్యోగాలను సృష్టిద్దాం. సుస్థిర వినియోగదారుల మార్కెట్‌ను నిర్మిద్దాం. వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరిద్దాం. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం. జీవవిచ్ఛిన్నమయ్యే ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహిద్దాం. హరిత క్షేత్రాల అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిద్దాం. ప్రపంచ పరిశుభ్రతకు దోహదపడదాం. సంప్రదాయేతర లేదా పునరుత్పాదక ఇంధన వనరులను (సౌర, పవన, సముద్రపు నీటి, జల, భూఉష్ణ శక్తులు) వినియోగించుకుందాం. సుస్థిర శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిద్దాం. భూమాత మనుగడకు హానికరమైన అన్ని రకాల కాలుష్యాలను తగ్గిద్దాం. మన గ్రహాన్ని రక్షించుకోవాల్సిన ప్రాముఖ్యతపై అవగాహన పెంచే కార్యక్రమాలను చేపట్టడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాలక అధికారులు, పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు, విద్యాసంస్థలు, పౌరులను ఏకతాటిపైకి తీసుకురావాలి.

మన ధరణి గ్రహం ఆరోగ్యంతో పాటు మన ఉజ్వల భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని గుర్తుంచుకుందాం. ఈ రోజు మనం తీసుకునే చర్యలే రేపటి మన ఆవాస గ్రహాన్ని తీర్చిదిద్దుతాయి. భూమి, దాని జీవావరణ వ్యవస్థలు మన ఇల్లు కాబట్టి, భూమితో, ప్రకృతితో శాంతిని నెలకొల్పి, ప్రోత్సహించడం ద్వారా మనం భవిష్యత్ తరాల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను సమతుల్యం చేయాలి. ప్రపంచ భూమి దినోత్సవం నాడు, రాత్రి 8:30 నుండి 9:30 గంటల మధ్య దీపాలు ఆర్పేసి, కొవ్వొత్తులు వెలిగించడం ద్వారా 'ఎర్త్ అవర్'ను పాటిస్తారు. రాబోయే తరాల కోసం ఒక సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించడానికి మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దాం. మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కో వద్దు, మన బొందను మనమే తవ్వుకోవద్దు.

మనుషులు రావచ్చు; మనుషులు పోవచ్చు; భూమి మాత్రమే శాశ్వతంగా కొనసాగుతుంది.



–మధుపాళీ
9949700037

# భారత నైపుణ్యం, వేగం, స్థాయి... కొరియా హై-టెక్ తయారీ రంగ నైపుణ్యాల మేళవింపుతో యువతకు అసంఖ్యాక అవకాశాలు: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈ రోజు రాష్ట్రపతి భవన్‌లో దక్షిణ కొరియా అధ్యక్షుడు గౌరవ లీ జే మ్యుంగ్‌కు సాదర స్వాగతం పలికారు. ఆయన గౌరవార్థం విందును ఏర్పాటు చేశారు.

భారత్‌లో తొలిసారిగా పర్యటిస్తున్న అధ్యక్షుడు మ్యుంగ్‌కు స్వాగతం పలుకుతూ... భారత్–కొరియా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం కోసం, ముఖ్యంగా కొరియా–భారత్ పార్లమెంటరీ స్నేహ బృంద అధ్యక్షులుగా ఆయన కృషిని రాష్ట్రపతి అభినందించారు. అధ్యక్ష పదవి చేపట్టిన మొదటి సంవత్సరంలోనే చేపట్టిన ఈ పర్యటన... ఇరు దేశాల మధ్య సంబంధానికి ఆయన ఇస్తున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుందని భారత రాష్ట్రపతి అన్నారు.

భారత్–కొరియాలు ఉమ్మడి విలువలను పంచుకునే శక్తిమంతమైన ప్రజాస్వామ్య దేశాలని రాష్ట్రపతి అన్నారు. భారత పార్లమెంటులో ఇటీవల భారత్–కొరియా పార్లమెంటరీ స్నేహ బృందాన్ని ఏర్పాటు చేయడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఇది భారత పార్లమెంటు, కొరియా జాతీయ అసెంబ్లీ మధ్య చర్చలు, పరస్పర సహకారాన్ని మరింత ప్రోత్సహిస్తుందని, తద్వారా పరస్పర అవగాహననూ, విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

ఓడల నిర్మాణం, ఓడరేవుల అభివృద్ధి, డిజిటల్ సహకారం, చిన్న–మధ్య తరహా పరిశ్రమలు, ఉక్కు, విద్య, పరిశోధన, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాలు సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారం కోసం ఇరుపక్షాలు ఒక ప్రతిష్ఠాత్మక అజెండాను నిర్దేశించుకున్నాయని రాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) విషయంగా చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరుపక్షాలు ఆమోదించాయని శ్రీమతి ముర్ము పేర్కొన్నారు. కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, పరిశుద్ధ ఇంధనం, సేవలు, పర్యాటకం వంటి రంగాల్లో కొరియాతో పరస్పర ప్రయోజనకర వాణిజ్య సంబంధాలను ముందుకు తీసుకెళ్లడానికి, సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి భారత్ ఎదురు చూస్తోందని భారత రాష్ట్రపతి తెలిపారు.

భారత్ నైపుణ్యం, వేగం, స్థాయిని కలిగి ఉందని... కొరియాకు హై–టెక్ తయారీ రంగంలో నైపుణ్యం ఉందని రాష్ట్రపతి అన్నారు. మన బలాలను ఏకం చేయడం ద్వారా, మన యువతకు అనేక అవకాశాలను సృష్టించగలమని తెలిపారు.

మానవాళికి సుస్థిర భవిష్యత్తును అందించడం లక్ష్యంగా భారత్, కొరియాలు హరిత, పరిశుద్ధ ఇంధన రంగాలు సహా ఇతర వాతావరణ సాంకేతిక రంగాల్లో సహకారానికి అవకాశాలను అన్వేషించాలని రాష్ట్రపతి కోరారు. భారత్, కొరియాల మధ్య సన్నిహిత సహకారం మన ప్రజలకు అపారమైన ప్రయోజనాలను చేకూర్చగలదని, ఇరు దేశాలు ఒకరి నుంచి మరొకరు ఎంతో నేర్చుకోవాల్సి ఉందని ఇరువురు నేతలు అంగీకరించారు. పర్యావరణం, ఆవిష్కరణలు, విద్య, నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత వంటి రంగాల్లో కలిసి పనిచేయడం ద్వారా ఇరు దేశాల ప్రజలు ప్రయోజనం పొందగలరని పేర్కొన్నారు.

# సుస్థిరాభివృద్ధిలో సహకారానికి భారత్- రిపబ్లిక్ ఆఫ్ కొరియా సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: వాతావరణ మార్పులు, సముద్ర, ఆర్కిటిక్ అంశాల్లో ఆచరణాత్మక సహకారం ద్వారా ప్రపంచ సుస్థిరాభివృద్ధి సవాళ్ల పరిష్కారానికి ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని భారత్– రిపబ్లిక్ ఆఫ్ కొరియా సంయుక్తంగా ప్రకటించారు.

పర్యావరణం పట్ల బాధ్యత గల దేశాలుగా.. పర్యావరణానికి సంబంధించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–2030 సమగ్ర పద్ధతిలో నెరవేర్చేందుకు ఇరుపక్షాలు నిబద్ధతను తెలియజేశాయి. ఇందుకోసం భూమి, గాలి, నీరు, జీవవైవిధ్యం, వ్యర్థాలు, సహజ వనరుల సుస్థిర నిర్వహణతో పాటు పర్యావరణ అంశాలు, వాతావరణ మార్పులపై పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరుపక్షాలు నిర్ణయించుకున్నాయి.

### వాతావరణ మార్పులపై సహకారం

నియమ నిబంధనలతో కూడిన అంతర్జాతీయ వ్యవస్థకు మద్దతిస్తూ, పారిస్ ఒప్పందానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేస్తూ.. మానవాళి, ప్రకృతి ఉనికికే ముప్పుగా పరిణమించిన వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు సంబంధిత చర్యలను బలోపేతం చేయాల్సిన కీలక అవసరాన్ని ఇరుదేశాలు గుర్తించాయి.

ఈ సందర్భంగా పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 6.2 ప్రకారం కుదిరిన ఎంఓసీని ఇరుపక్షాలు స్వాగతించాయి. పెట్టుబడి ఆధారిత కర్బన ఉద్గారాల తగ్గింపు ప్రాజెక్టుల కోసం సహకార విధానాన్ని ఇది నిర్దేశిస్తుంది. జాతీయంగా నిర్ణయించిన సహకార లక్ష్యాల సాధనను వేగవంతం చేస్తుంది. వాతావరణ చర్యల విషయంలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. కార్బన్ మార్కెట్, ఆర్టికల్ 6.2, సహకార విధానం, పునరుత్పాదక ఇంధనం, తక్కువ కర్బన సాంకేతికతలతో సహా వాతావరణ మార్పులకు సంబంధించిన అంశాలపై ఇరుపక్షాలు పరస్పరం సహకరించుకుంటాయి.

### పర్యావరణ సంబంధిత సహకారం, సుస్థిరాభివృద్ధి

పర్యావరణ బాధ్యత గల దేశాలుగా వాతావరణం, పర్యావరణ రంగంలో సహకారానికి ఎంఓయూ ద్వారా సంస్థాగత సహకారాన్ని కొనసాగించాలని భారత్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా నిర్ణయించుకున్నాయి.

అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ)లో సభ్య దేశంగా రిపబ్లిక్ ఆఫ్ కొరియా చేరటాన్ని భారత్ స్వాగతించింది. గ్లోబల్ గ్రీన్ గ్రోత్ ఇనిస్టిట్యూట్ (జీజీజీఐ)లో సభ్య దేశంగా భారత్ చేరికను రిపబ్లిక్ ఆఫ్ కొరియా స్వాగతించింది.

ఆర్థికాభివృద్ధి, పర్యావరణ సమతుల్యత, ఆహార భద్రతలో సముద్రాల ప్రాముఖ్యతను గుర్తిస్తూ.. సముద్ర విజ్ఞానం, సుస్థిర మత్స్య సంపద, తీరప్రాంత వ్యవస్థల రక్షణ, సముద్ర కాలుష్య నివారణ వంటి రంగాల్లో సహకార విస్తరణకు ఇరుపక్షాలు అంగీకరించాయి.

నీలి ఆర్థిక వ్యవస్థలో ఇరు దేశాలు సహకరించుకుంటాయి. శాస్త్రీయ, సముద్రయాన సంస్థల మధ్య పరస్పర సహకారాన్ని ప్రోత్సహించుకుంటాయి.

# మహిళల సమస్యలపై అవగాహన..



అమరావతి, ఏప్రిల్ 21: కదిరి టౌన్‌లో మహిళల సమస్యలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు ఒక ముఖ్యమైన ర్యాలీ, సదస్సు నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఉదయం డీఎస్పీ కదిరి వారి ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు, REDS, సమత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సుమారు 100 మంది పాల్గొని ఇందిరాగాంధీ సర్కిల్ నుంచి తాయి గ్రాండ్ హోటల్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీ ద్వారా మహిళల భద్రత, హక్కులు, సామాజిక సమస్యలపై ప్రజలకు సందేశం అందించారు.

తదుపరి ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో సుమారు 200 మంది 9వ, 10వ తరగతి విద్యార్థినులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డయల్–100 సేవలు, POCSO చట్టం, బాల్య వివాహాల నివారణ, ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై విద్యార్థినులకు సమగ్రంగా అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో సీఐ కదిరి టౌన్, సీడీపీవో శ్రీమతి రాధిక, ఐసీడీఎస్ అధికారులు, REDS సమత స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మహిళల భద్రత, బాలికల రక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు.

### రాష్ట్రపతిని కలిసిన భారతీయ రైల్వే ప్రొబేషనరీ అధికారులు, కేంద్ర ఇంజనీరింగ్ సర్వీస్ కు చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:భారత రైల్వే ప్రొబేషనరీ అధికారులు (2022, 2023 బ్యాచ్) కేంద్ర ఇంజనీరింగ్ సర్వీస్ (రోడ్లు)కు చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (2021 నుంచి 2024 బ్యాచ్ వరకు) ఏప్రిల్ 20న రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు.

అధికారులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ.. భారత్ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న కీలక తరుణంలో యువ అధికారులు ప్రజా సేవలో చేరారని అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణమే సమష్టి లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతోందని ఆమె అన్నారు. భారతీయ రైల్వే, సెంట్రల్ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారులుగా.. వీరు చేపట్టే బాధ్యతలు లక్షలాది మంది ప్రజల జీవితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయని తెలిపారు. అధికారులు తీసుకునే నిర్ణయాలు, చర్యలు పౌరుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు.

ఆధునిక దేశాల నిర్మాణానికి మౌలిక సదుపాయాలే పునాది అని రాష్ట్రపతి తెలిపారు. రైల్వేలు, రహదారులు కేవలం రవాణా వ్యవస్థలు మాత్రమే కావని.. ఆర్థిక విస్తరణకు, సామాజిక సమ్మేళనానికి, జాతీయ సమైక్యతకు సాధనాలుగా పేర్కొన్నారు. ఒక రైలు మారుమూల గ్రామానికి చేరుకున్నా లేదా ఒక రహదారి సుదూర ప్రాంతాన్ని కలిపినా.. అది ఆయా ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అపారమైన అవకాశాలను కల్పిస్తుందని అన్నారు.

పటిష్టమైన మౌలిక సదుపాయాలు రవాణా ఖర్చులను తగ్గించి, వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తూ, పెట్టుబడులను, ఉత్పాదకతను పెంచుతాయని రాష్ట్రపతి అన్నారు. ఇది వివిధ ప్రాంతాలను, ప్రజలను దగ్గర చేయడం ద్వారా జాతీయ ఐక్యతను బలపరుస్తుందన్నారు. కేవలం గణాంకాలు మాత్రమే విజయానికి కొలమానం కాదన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని సూచించారు. వారు చేసే పని ప్రజల జీవితాలను ఎంత వరకు మెరుగుపరిచిందనేదే అసలైన విజయమని ఆమె స్పష్టం చేశారు. ప్రజా సేవలు నిజాయితీ, జవాబుదారీతనం, అత్యుత్తమ పనితీరుపై అంకితభావం వంటి విలువలను కాపాడాలని రాష్ట్రపతి అధికారులకు సూచించారు. విధి నిర్వహణలో సవాళ్లు ఎదురైనప్పుడు, కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు ఆ విలువలే అధికారులకు మార్గదర్శకంగా ఉండాలని చెప్పారు.

# రోడ్డు ప్రమాదాలపై యుద్ధ ప్రాతిపదిక చర్యలు

### తిరుపతి జిల్లా యంత్రాంగం బస్సు యాత్ర ప్రారంభం



తిరుపతి, ఏప్రిల్ 21:జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు తిరుపతి జిల్లా యంత్రాంగం వినూత్నంగా ప్రత్యేక బస్సు యాత్రను ప్రారంభించింది. మంగళవారం ఉదయం శిల్పారామం వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు కలిసి ఈ కార్యక్రమంపై విలేకరుల సమావేశం నిర్వహించారు.

జిల్లాలో ప్రతి సంవత్సరం సగటున 550 నుంచి 560 మంది వరకు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారుల విస్తరణ, తిరుమల భక్తుల రాక పెరగడం, ఓవర్ స్పీడింగ్, విశ్రాంతి లేకుండా డ్రైవింగ్, హెల్మెట్ వినియోగం లోపం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలు వంటి కారణాల వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని చెప్పారు. గతంలో తీవ్రమైన ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, జిల్లాలో మొత్తం 48 ప్రాంతాలను గుర్తించినట్లు వెల్లడించారు.


ఈ బ్లాక్ స్పాట్లను పోలీస్, రవాణా, ఆర్ & బి, జాతీయ రహదారులు, పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి రెండు బస్సుల ద్వారా ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాంతంలో రహదారి లోపాలు, స్థానిక పరిస్థితులను విశ్లేషించి, ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నామని చెప్పారు. తాత్కాలిక మరియు శాశ్వత పరిష్కారాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 'జీరో డెత్ పాలసీ' లక్ష్యంగా వచ్చే రెండు నుంచి మూడు నెలల్లో అన్ని బ్లాక్ స్పాట్లను పూర్తిగా సరిదిద్దే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. భద్రతా చర్యలలో భాగంగా బ్లింకర్లు, రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే లాంగ్ డిస్టెన్స్ ప్రయాణికుల కోసం జాతీయ రహదారుల వెంట విశ్రాంతి ప్రాంతాల ఏర్పాటు పై సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.

జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు మాట్లాడుతూ రోడ్డు భద్రతకు సంబంధించి సమగ్ర కార్యాచరణ చేపట్టామని చెప్పారు. ఒకవైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, మరోవైపు చట్టాలను కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడింగ్ నియంత్రణ కోసం ఆల్కహాల్ మీటర్లు, స్పీడ్ గన్స్ వినియోగాన్ని పెంచుతున్నామని చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. తిరుపతి జిల్లాకు వచ్చే భక్తులు, స్థానికులు అందరూ రహదారి భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ నష్టాలను తగ్గించేందుకు అధికారులు, మీడియా, ప్రజలు కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సింగపూర్ చేరుకున్న మంత్రుల బృందానికి ఘన స్వాగతం



శ్రీకాకుళం, ఏప్రిల్ 21:మంగళవారం ఉదయం సింగపూర్ చేరుకున్న మంత్రులు కింజారపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, సత్య కుమార్ యాదవ్, అనగాని సత్య ప్రసాద్, బి.సి. జనార్దన్ రెడ్డిలకు సింగపూర్ లోని తెలుగు అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం నుండి ఏప్రిల్ 27 వరకు 7 రోజుల పాటు సింగపూర్‌లో అధికారికంగా మంత్రులు బృందం పర్యటిస్తుంది. సింగపూర్‌లో ఆధునిక పరిపాలనా విధానాలను, మౌలిక సదుపాయాల అభివృద్ధిని మంత్రుల బృందం అధ్యయనం చేయనుంది.

సింగపూర్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ తో సింగపూర్– ఏపీ జాయింట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ వరల్డ్ క్లాస్ అవగాహన ఒప్పందంలో భాగంగా, సింగపూర్ పాలన నమూనా, రాజకీయ జవాబుదారీతనం, నేషన్ ఫస్ట్ వంటి నాయకత్వ సూత్రాలపై నిర్వహించే ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టిఓటి) శిక్షణా కార్యక్రమంలో మంత్రులు పాల్గొంటారని మంత్రి అచ్చెన్నాయుడు క్యాంపు కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

# సీఈపీఏ చర్చల నేపథ్యంలో రెట్టింపు కానున్న భారత్-కొరియా వాణిజ్యం: శ్రీ లీ జే మ్యూంగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:140 కోట్ల జనాభాతో... ప్రపంచంలో నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా నిలుస్తోందని దక్షిణ కొరియా (ఆర్ఓకే) అధ్యక్షుడు శ్రీ లీ జే మ్యూంగ్ పేర్కొన్నారు.

న్యూఢిల్లీలో జరిగిన 'భారత్-కొరియా వ్యాపార సదస్సులో ఆయన ప్రసంగిస్తూ... ఇరు దేశాల మధ్య వాణిజ్యం, వ్యాపార విస్తరణకు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై కొనసాగుతున్న చర్చలతోపాటు ద్వైపాక్షిక వాణిజ్యం గణనీయంగా వృద్ధి చెందడానికి అవకాశం ఉందని అన్నారు. నిరంతర ప్రయత్నాలతో ఇది రెట్టింపు అవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

కృత్రిమ మేధ రంగంలో భారత్‌కు ఉన్న నైపుణ్యాన్ని ఉపయోగించుకుంటూ, పరస్పర సహకారంతో భవిష్యత్తు కోసం అత్యంత సాంకేతికతో కూడిన పరిశ్రమలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అలాగే నౌకాయాన రంగంలో కూడా సహకారాన్ని మరింత బలోపేతం చేస్తామని ప్రకటించారు.

కేవలం ఆర్థిక సహకారానికే పరిమితం కాకుండా, ఇరు దేశాల ప్రజల మధ్య బలమైన బంధం, నమ్మకాన్ని పెంపొం దించుకో వాల్సిన అవసరం ఉందని తెలిపారు.

భారత్-కొరియా వ్యాపార సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ప్రసంగించారు. భారత్-కొరియా పారిశ్రామిక సహకార కమిటీపై కుదిరిన అవగాహన ఒప్పందం ద్వైపాక్షిక ఆర్థిక బంధాన్ని బలోపేతం చేయడంలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఈ కమిటీలో వాణిజ్యం, పరిశ్రమలు, వ్యూహాత్మక వనరులు, స్వచ్ఛమైన ఇంధనం అనే నాలుగు కీలక రంగాలపై వర్కింగ్ గ్రూపులు పనిచేస్తాయని ఆయన తెలిపారు. నేడు జరిగిన ఈ వ్యాపార వేదికలో మొత్తం 16 అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరిగాయని చెప్పారు.

మరిన్ని పెట్టుబడులను ప్రోత్సహించడానికి, కొరియా కంపెనీలు భారత మార్కెట్‌లోకి సులభంగా ప్రవేశించేలా, దేశంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కూడిన 'కొరియా ఎన్‌క్లేవ్' (కొరియా ప్రత్యేక పారిశ్రామిక ప్రాంతం) ఏర్పాటుపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, అధ్యక్షుడు శ్రీ లీ జే మ్యూంగ్ చర్చించినట్లు శ్రీ గోయల్ వెల్లడించారు. గత మూడున్నర ఏళ్లలో 38 అభివృద్ధి చెందిన దేశాలతో కుదుర్చుకున్న తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా సాధ్యమైన భారీ స్వదేశీ డిమాండును, అలాగే ప్రపంచ జీడీపీలో దాదాపు మూడింట రెండు వంతుల వాటాకు భారత్‌కు ఉన్న ప్రాధాన్యతను సద్వినియోగం చేసుకోవడానికి కొరియా కంపెనీలకు ఈ కార్యక్రమం సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు.

భారత్-దక్షిణ కొరియా మధ్య ప్రస్తుతమున్న 27 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 54 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయాలని ఇరు దేశాల నాయకత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు శ్రీ గోయల్ వివరించారు. దీనిని సాధించాలంటే దాదాపు 18 శాతం వార్షిక వృద్ధి రేటు అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ లక్ష్యం ఇరు దేశాల మధ్య ఉన్న భాగస్వామ్య నిజమైన సామర్థ్యాన్ని పూర్తిగా ప్రతిబింబించదని, ఆర్థిక సహకారంలో తదుపరి దశకు చేరుకోవడానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మరింత సమతుల్యమైన ఆర్థిక భాగస్వామ్యాన్ని సాధించేందుకు, సుంకేతర అడ్డంకులను పరిష్కరించడం, మూల నియమాలను సులభతరం చేయడం, మార్కెట్ ప్రాప్యతను విస్తరించడం, వ్యాపార సౌలభ్యాన్ని పెంచడం వంటి అంశాలతో సహా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని ఆధునీకరించడానికి ఇరు దేశాలు ఫాస్ట్ ట్రాక్, మిషన్-మోడ్ విధానంలో పనిచేయడానికి అంగీకరించాయని మంత్రి తెలిపారు.

సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఆధునిక తయారీ రంగం, ఈ-మొబిలిటీ, హరిత ఇంధనం, నౌకా నిర్మాణం, డిజిటల్ వాణిజ్యం వంటి రంగాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేయడానికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సహ-ఉత్పత్తి, సహ-రూకల్పన, సహ-ఆవిష్కరణల ద్వారా రెండు దేశాలు కలిసి పనిచేయాలని, తద్వారా ప్రపంచ మార్కెట్లకు నాణ్యమైన, సరసమైన ధరల ఉత్పత్తులను అందించవచ్చని ఆయన పేర్కొన్నారు.

భారతదేశ ఆర్థిక ప్రస్థానాన్ని వివరిస్తూ.. శ్రీ పీయూష్ గోయల్ ఇలా పేర్కొన్నారు. ప్రస్తుతం 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరుపుకునే 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవడమే లక్ష్యమని అన్నారు. భారీ సంఖ్యలో ఉన్న ప్రతిభావంతులైన యువత, 140 కోట్ల మంది పౌరుల ఆకాంక్షలు, పెరుగుతున్న ఆదాయాలతో వేగంగా విస్తరిస్తున్న మధ్యతరగతి ఆదాయం వంటి అంశాల వల్ల వ్యాపారాలకు ఇది జీవిత కాలంలో ఒక్కసారి మాత్రమే లభించే అద్భుత అవకాశమని ఆయన అభివర్ణించారు.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు అస్థిరంగా ఉన్నప్పటికీ, భారత్ మాత్రం ఎంతో స్థిరంగా ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న సాహసోపేతమైన సంస్కరణలు, మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు, అనవసర నిబంధనలను, అడ్డంకులను తొలగించడం, వ్యాపార సౌలభ్యం కోసం బలమైన విధానపరమైన ప్రోత్సాహం కారణంగా భారత్ స్థిరత్వానికి కేంద్రంగా నిలుస్తుందని చెప్పారు.

భారత్- దక్షిణ కొరియా మధ్య సంబంధాలు నిన్న మొన్నటివి కావని, ఇవి రెండు వేల ఏళ్ల నాటివని శ్రీ పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న నమ్మకం, ప్రజాస్వామ్య విలువలు, పురాతన సాంస్కృతిక బంధాలే ఈ స్నేహానికి పునాదులని అన్నారు. భారత వృద్ధిలో కొరియన్ కంపెనీలు పోషిస్తున్న పాత్రను, వారు సాధించిన విజయాన్ని ఆయన అభినందించారు.

ఈ పర్యటన భారత్-కొరియా సంబంధాలలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని శ్రీ గోయల్ ధీమా వ్యక్తం చేశారు. ఇరు దేశాలు కలిసి పనిచేస్తూ, పరస్పర పురోభివృద్ధిని సాధించాలని ఆయన ఆకాంక్షిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

ఫిక్కీ (ఎఫ్ఐసీసీఐ) అధ్యక్షుడు, ఆర్‌పీజీ గ్రూపు ఉప ఛైర్మన్ శ్రీ అనంత్ గోయెంకా మాట్లాడుతూ.. సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాల నుంచి డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధ వరకు భారత్‌లో ఉన్న భారీ మార్కెట్ స్థాయి, కొరియా వద్ద ఉన్న నూతన ఆవిష్కరణల శక్తితో అద్భుతంగా సరిపోతుందని అన్నారు. ఇరు దేశాలు కలిసి భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా ఒక దృఢమైన ఆర్థిక కారిడార్‌ను నిర్మించగలవని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థ మారుతున్న తరుణంలో.. భారత్, కొరియాలకు ఒక ప్రత్యేక అవకాశం ఉందని గోయెంకా తెలిపారు. బాహ్య ఒత్తిళ్లకు లేదా సంక్షోభాలకు తలొగ్గకుండా, దీర్ఘకాలంపాటు బలంగా నిలబడగలిగేలా.. వైవిధ్యమైన, కొత్త ఆలోచనలతో కూడిన ఒక బలమైన ఆర్థిక కారిడార్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని అన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో అందరం భాగమౌదాం

## -కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, ఏప్రిల్ 21: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. జాతీయ పౌర సేవల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ బృందం మంగళవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాంకేతికతను జోడించి పాలనను సామాన్యులకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జిల్లా ఎన్విరాన్మెంట్ ఛైర్మన్ పొన్నాడ రవి కుమార్ మాట్లాడుతూ.. దేశ సేవలో నిరంతరం శ్రమిస్తున్న అధికారుల కృషిని అభినందించడం ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ వారాంతంలో చేపట్టబోయే కార్యక్రమాలకు కలెక్టర్, జేసీ తమ మద్దతు ప్రకటించారు.

అనంతరం రాజమండ్రి సెంట్రల్ జైలు ఖైదీలు నేసిన గుడ్డ సంచులను వారు పరిశీలించి, శ్రీకాకుళంలో కూడా వాటి తయారీకి ఉన్న అవకాశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ, జెసిఐ మెయిన్ జాయింట్ సెక్రటరీ సిరిబారికి బాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# బుడమేరు వంతెన వద్ద వాహనదారులకు కౌన్సిలింగ్..

## -నియమాలను పాటిద్దాం.. ఇంటికి సురక్షితంగా చేరుకుందాం

## -అజిత్ సింగ్ నగర్ ట్రాఫిక్ సిఐ ప్రభాకర్.




అమరావతి, ఏప్రిల్ 21: వాహనంపై సురక్షిత ప్రయాణం కొరకు హెల్మెట్ క్లిప్ తప్పనిసరి అని అజిత్ సింగ్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ ప్రభాకర్ అన్నారు. అజిత్ సింగ్ నగర్ ట్రాఫిక్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం బుడమేరు వంతెన సమీపంలో హెల్మెట్ క్లిప్ ఫర్ సేఫ్ జర్నీ కార్యక్రమం నిర్వహించారు. కేవలం హెల్మెట్ ధరించడమే కాకుండా, దానికి ఉండే స్ట్రాప్ (క్లిప్) పెట్టుకోవడం ఎంత ముఖ్యమో వాహనదారులకు వివరించడం జరిగిందని తెలిపారు.

సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ.. చాలామంది వాహనదారులు పోలీసుల తనిఖీలకు భయపడో లేదా నామమాత్రంగానో హెల్మెట్ ధరిస్తున్నారుకానీ, ప్రమాదం జరిగిన సమయంలో హెల్మెట్ తల నుండి విడిపోకుండా ఉండాలంటే క్లిప్ పెట్టుకోవడం తప్పనిసరి అన్నారు. క్లిప్ లేని హెల్మెట్ గాలిలో ఎగిరిపోయే టోపీతో సమానమన్నారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో జరిగే మరణాలలో 80శాతం తలకు తగిలే గాయాల వల్లే జరుగుతున్నాయనీ, హెల్మెట్ ధరించడం వల్ల మెదడుకు గాయం అయ్యే ప్రమాదం గణనీయంగా తగ్గుతుందన్నారు.

హెల్మెట్ పెట్టుకున్న తర్వాత చిన్ స్ట్రాప్(గడ్డం కింద ఉండే క్లిప్) బిగించడం వల్ల, వాహనం పల్టీ కొట్టినప్పుడు కూడా హెల్మెట్ తలకే ఉంటుంది. తద్వారా ప్రాణాపాయం తప్పుతుంద న్నారు. ప్రతి వాహనదారుడు తమ కోసం కాకపో యినా, ఇంట్లో ఎదురుచూసే తమ కుటుంబ సభ్యుల కోసమైనా ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాలని సీఐ కోరారు. ఈ సందర్భంగా బుడమేరు వంతెన మీదుగా వెళ్తున్న వాహనదారులను ఆపి, హెల్మెట్ క్లిప్ లేని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

స్వయంగా పోలీసు సిబ్బందే కొందరు వాహనదారులకు క్లిప్పులు తగిలించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు. వాహనదారులు పోలీసుల సూచనలను సానుకూలంగా స్వీకరించి, ఇకపై తప్పనిసరిగా హెల్మెట్ క్లిప్ ధరిస్తామని హామీ ఇచ్చారు

# భారత 'సమృద్ధ్ గ్రామ్' పథకానికి 'సానుకూలావరణ సృష్టి' విభాగంలో 'డబ్ల్యూఎస్ఐఎస్-2026' బహుమతి ప్రతిపాదన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీఓటీ) అమలు చేస్తున్న "సమృద్ధ్ గ్రామ్: భారత్‌నెట్ ద్వారా సమీకృత ఫిజిటల్ సేవల ప్రదానం" పథకం ప్రతిష్ఠాత్మక 'డబ్ల్యూఎస్ఐఎస్-2026' (వరల్డ్ సమ్మిట్ ఆన్ ది ఇన్ఫర్మేషన్ సొసైటీ) బహుమతికి పోటీ పడుతోంది. ఈ మేరకు 'యాక్షన్ లైన్ ఏఎల్ సి6: సానుకూ లావరణ సృష్టి' విభాగం కింద ప్రతిపాదిత పథకాల్లో ఇదొకటి కావడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో సార్వజనీన వృద్ధి సాధనకు డిజిటల్ మౌలిక సదుపాయాల వినియోగంలో భారత్ కృషికి లభించిన ఒక ప్రధాన అంతర్జాతీయ గుర్తింపుగా దీన్ని పరిగణించవచ్చు.

'భారత్‌నెట్' చట్రం ఆధారంగా రూపొందించిన సమృద్ధి గ్రామ్ పథకం కింద భౌతిక మౌలిక సదుపాయాలను డిజిటల్ వేదికలతో జోడిస్తూ ఏకగవాక్ష "ఫిజిటల్" సేవలందించే సామాజిక కూడళ్లుగా సమృద్ధి కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పరిపాలన, ఆర్థిక సార్వజనీనత, ఇ-కామర్స్ వంటి రంగాల్లో అవసరమైన సేవలన్నీ ఈ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రజానీకానికి నిరాటంకంగా లభిస్తాయి. అంతేకాకుండా హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్, ఎఫ్‌టీటీహెచ్ సంధానం, బహిరంగ వైఫై సహా దూర-వైద్యం, అత్యాధునిక తరగతి గదులు, డిజిటల్ పరిపాలన సేవలు, సాంకేతికత ఆధారిత వ్యవసాయం వంటి వాటిలోనూ విప్లవాత్మక మార్పులకు ఇవి దోహదం చేస్తాయి.

అనుసంధానానికి పరిమితం కాకుండా సామాజిక-ఆర్థిక సాధికారత కల్పనలో టెలికాం మౌలిక సదుపాయాలు ఉత్ప్రేరక పాత్ర పోషించే తీరును ఈ పథకం స్పష్టం చేస్తోంది. గ్రామీణులకు మెరుగైన సేవల లభ్యత, ప్రయాణ సమయం ఆదా, వ్యయం తగ్గడం, డిజిటల్ అవగాహన ఇనుమడించడం, జీవనోపాధి అవకాశాలు పెరగడం వంటి సానుకూలతలను తరుణదశ ఫలితాలు సూచిస్తున్నాయి.

విస్తరణీయ, నిర్వహణీయ నమూనాగా రూపొందిన ఈ పథకం సామాజిక ఆధారిత వ్యవస్థాపన చట్రం ద్వారా అమలవుతుంది. అందువల్ల దేశంలోనే కాకుండా భౌగోళికంగా ఎక్కడైనా ఇది అనుకరణ సాధ్యం కాగలదు.

'డబ్ల్యూఎస్ఐఎస్ ప్రైజెస్-2026' కింద పథకాల ఎంపిక కోసం సార్వత్రిక ఓటింగ్ దశ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఆయా కార్యక్రమాల భాగస్వాములు, సంస్థలు, పౌరులు తమ పూర్తి సమాచారంతో (సంస్థ పేరు, రంగం, దేశం, వినియోగదారు వివరాలు) 'డబ్ల్యూఎస్ఐఎస్' అభిప్రాయ స్వీకరణ వేదికలో నమోదు చేసుకుని ఈ ప్రాజెక్టుకు మద్దతివ్వాలని ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు 2026 మే 3న తుది గడువు ముగిసేలోగా కింది లింకు ద్వారా "ఏఎల్ సి6: ఎనేబ్లింగ్ ఎన్విరాన్‌మెంట్'' విభాగం కింద సమృద్ధి గ్రామ్ ప్రాజెక్టుకు ఓటు వేయాల్సి ఉంటుంది:

'సమృద్ధ్ గ్రామ్ ఫిజిటల్ సర్వీసెస్' పథకం కింద కేంద్ర సమాచార శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం.సింధియా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గుణ జిల్లా ఉమ్రి గ్రామంలో ఇటీవల దేశంలోనే తొలి 'సమృద్ధి కేంద్రా'నికి శ్రీకారం చుట్టారు. గ్రామీణ భారత్ అంతటా డిజిటల్ సేవల విస్తరణలో ఇదొక కీలక మలుపుగా నిలిచింది.

వరల్డ్ సమ్మిట్ ఆన్ ది ఇన్ఫర్మేషన్ సొసైటీ

'డబ్ల్యూఎస్ఐఎస్' అనేది డిజిటల్ మౌలిక సదుపాయాల పురోగమనానికి ఊతమిస్తూ, సార్వజనీన సమాచార సమాజాలను ప్రోత్సహించడంపై దృష్టి సారించే ప్రపంచవ్యాప్త గుర్తింపుగల బహుళ- భాగస్వామ్య వేదిక. కీలక డిజిటల్ అంశాల్లో పరస్పర సహకారం దిశగా ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పౌర సమాజం, అంతర్జాతీయ సంస్థలు సహా ప్రధాన భాగస్వాములను ఇది ఒకే వేదికపైకి తెస్తుంది.

అంతర్జాతీయంగా సుస్థిర ప్రగతికి దోహదం చేసే వినూత్న 'ఐసీటీ' ఆధారిత ప్రాజెక్టులకు 'డబ్ల్యూఎస్ఐఎస్' బహుమతి ఒక ప్రత్యేక గుర్తింపునిస్తుంది. ఈ బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని 2026 జూలై 6?10 తేదీలలో జెనీవాలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అత్యాధునిక సాంకేతికతలు, డిజిటల్ సార్వజనీనత, సైబర్ భద్రత, అంతర్జాతీయ డిజిటల్ సహకారం వగైరాలపై చర్చలకు ఇది వేదిక కానుంది.

ఏ.ఎస్. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శన

# వెస్ట్ బైపాస్‌పై ప్రత్యేక దృష్టి

## -బ్లాక్ స్పాట్స్ గుర్తింపు

## -ట్రాఫిక్ ఏసిపి శ్రీ వేద

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: విజయవాడ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రహదారి భద్రతే ధ్యేయంగా పని చేస్తామని




విజయవాడ నూతన ట్రాఫిక్ ఏసీపీ శ్రీ వేద స్పష్టం చేశారు. ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా బుధవారం ఆమె అజిత్ సింగ్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కండ్రిక ప్రాంతంలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడ వాహనాల నిలిపివేత, ఇతర వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు.

కేవలం సాధారణ తనిఖీలు మాత్రమే కాకుండా, నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి ఒక పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే వెస్ట్ బైపాస్ వంటి కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు, క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాల నుండి ఉపశమనం లభిస్తుందని ఏసిపి ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, వాహనదారులను అప్రమత్తం చేయడానికి అక్కడ హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, పోలీసుల ప్రయత్నాలకు ప్రజలు సహకరిస్తేనే సురక్షితమైన రవాణా వ్యవస్థ సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ ప్రభాకర్, ఎస్సై దుర్గాదేవి, కృష్ణ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐకేపీ యానిమేటర్లకు సెల్ ఫోన్లు పంపిణీ..ఎమ్మెల్యే సునీత

అమరావతి, ఏప్రిల్ 21: స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే సేవల్లో వేగం పెంచడం కచ్చితమైన సమాచారం పారదర్శకత కోసమే యానిమేటర్లకు స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్నామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మంగళవారం రాప్తాడు మండల కేంద్రంలోని పంగల్ రోడ్డు దగ్గర ఉన్న టీటీడీసీలో నియోజకవర్గ యానిమేటర్లతో సమావేశం నిర్వహించారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు అనంతపురం రూరల్ రాప్తాడు మండలాల యానిమేటర్లకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఐసిడిఎస్ జిల్లా పిడి టీ. శైలజ చేతుల మీదుగా ప్రభుత్వం మంజూరు చేసిన సెల్ ఫోన్లను పంపిణీ చేశారు.

ఈ సంధర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పరిపాలన ఇతర కార్యక్రమాలను ఆధునీకరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక బృందాల కార్యకలాపాల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం యానిమేటర్లకు 120 మందికి ఉచిత మొబైల్ ఫోన్లు పంపిణీ చేసిందన్నారు.

దీని ద్వారా రికార్డులన్నీ సెల్ ఫోన్ లో ఉండేలా చేసుకోవచ్చన్నారు. యానిమేటర్లు ఈ సెల్ ఫోన్ల ద్వారా రుణాలు గ్రూపు నిర్వహణ, పుస్తకాల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని



రికార్డ్ చేసి నేరుగా రాష్ట్ర సర్వర్‌లకు అప్‌లోడ్ చేయడానికి వీలు ఉంటుందన్నారు. ఏ సభ్యురాలు ఎంత డబ్బు చెల్లిస్తున్నారు అది బ్యాంక్ వరకు చేరుతోందా లేదా ఇంకా ఎంత చెల్లించాలి వంటి సమగ్ర వివరాలు సెల్ ఫోన్ లో నిక్షిప్తమవుతాయన్నారు. ఇది వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు పారదర్శకత నమ్మకాన్ని పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంలు రాప్తాడు టి.సునీత ఆత్మకూరు పద్మావతి అనంతపురం రూరల్ రవికుమార్ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ టి.సుభద్రమ్మ రాప్తాడు మండల సమైక్య అధ్యక్షురాలు సుశీలమ్మ ఆత్మకూరు లక్ష్మీదేవి అనంతపురం చంద్రకళ ఎఫ్ పిఓలు ధనలక్ష్మి చంద్రకళ యానిమేటర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభం పగుళ్లతో ప్రమాదం

## -అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

అమరావతి, ఏప్రిల్ 21:నందికొట్కూరు పట్టణంలోని సాయిబాబా పేట కాలనీలో ఎఫ్రాత ప్రార్థన మందిరం లైన్లో విద్యుత్ స్తంభం ప్రమాదం అంచులు ఉంది అని స్థానిక కాలనీ ప్రజలు తెలుపుతున్నారు "106o/7" అని గుర్తించబడిన కాంక్రీట్ విద్యుత్ స్తంభం పూర్తిగా పగుళ్లతో దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. స్తంభం చుట్టూ అనేక విద్యుత్ తీగలు గట్టిగా చుట్టబడి ఉన్నాయి. పొడవునా లోతైన పగుళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి అని కాలనీవాసులు భయాందోళన గురవుతున్నారు.

ఇది నివాస ప్రాంతంలో ఉండటంతో దగ్గరలో బట్టలు ఆరేస్తున్నారు, ఇళ్లు ఉన్నాయి, దీంతో స్థానికుల భద్రతకు ముప్పు ఏర్పడింది అని తెలుపుతున్నారు. స్తంభం ఉపరితలంపై ఉన్న పెద్ద పగుళ్లు దాని దృఢత్వం దెబ్బతిన్నట్లు సూచిస్తున్నాయి. పైభాగంలో వదులుగా ఉన్న తీగలు ఆంధ్రప్రదేశ్‌లో సాధారణంగా వచ్చే బలమైన గాలులు లేదా




వర్షాకాలంలో కూలిపోయే ప్రమాదాన్ని పెంచుతున్నాయి. స్థానికులు చెప్పిన ప్రకారం, ఇది జనావాస ప్రాంతంలో ఉన్నప్పటికీ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఇలాంటి పరిస్థితి విద్యుత్ భద్రతా నిబంధనలకు విరుద్ధం. స్తంభం కూలిపోతే విద్యుత్ సరఫరా అంతరాయం, షార్ట్ సర్క్యూట్ లేదా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

# 'హక్కుల సాధనకు యువత ఉద్యమించాలి'

## – పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ




నల్గొండ, ఏప్రిల్ 21:పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా హక్కుల సాధన కోసం యువత సమిష్టిగా ఉద్యమించాలని ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని రమాదేవి ఫంక్షన్ హాల్‌లో పి వై ఎల్ యాదాద్రి భువనగిరి జిల్లా 9వ మహాసభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మారు జోడి సిద్దేశ్వర్ బిగిపిడికిలి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి పాలకులు యువతను చైతన్యవంతులుగా తీర్చిదిద్దాల్సింది పోయి మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాల ఊబిలోకి నెట్టి తమ అధికారాన్ని కాపాడుకుంటున్నారని విమర్శించారు. యువత ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయేలా చేసి, మత్తులో ముంచి పాలన సాగించడం పాలకుల కుట్రలో భాగమే అన్నారు., నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా కేవలం ఎన్నికల సమయంలో దొంగ హామీలతో యువతను మోసం చేస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, నోటిఫికేషన్ల జాప్యంతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పాలకుల తప్పుడు వాగ్దానాలను నిలదీయాలనీ కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, తమ హక్కుల కోసం క్షేత్ర స్థాయిలో ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యావంతులైన యువత రాజకీయాల్లోకి రావాలని, రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని, ప్రశ్నించే గొంతుకగా మారాలన్నారు. దేశ ప్రగతి యువత శ్రమశక్తి పైనే ఆధారపడి ఉందని గుర్తించి, వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్ కోసం సిద్ధం కావాలన్నారు. ?యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రగతిశీల యువజన సంఘం (ఖజఒ) నిరంతరం రాజీలేని పోరాటం చేస్తోందని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, యువతను పట్టిపీడిస్తున్న మత్తు పదార్థాలను అరికట్టాలని, ఉచిత వైద్యం, ఉపాధిని ప్రాథమిక హక్కుగా గుర్తించాలని పేర్కొన్నారు.

ఈ మహాసభల్లో ఏ.ఐ.కె.ఎం.ఎస్.రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.జనార్దన్, పి.వై.ఎల్. రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్, కోశాధికారి డి.రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్, కోశాధికారి పగడాల శివ, పి.డి.ఎస్.యూ.జిల్లా కార్యదర్శి ఆర్.ఉదయ్, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు జి.నాగరాజు, గోరుగంటి ముత్యాలు, బాలకృష్ణ, పోతగాళ్ల నర్సింహ, సర్వన్, వెంకటేష్, మల్లేష్, సుధాకర్, ఆకుల కృష్ణ, శికిలం వెంకటేష్, మామిడాల భాను, గోరుగంటి నవీన్, శ్రీనాథ్, శివ, పాక నవీన్ పాల్గొన్నారు.

# ఐకేపీ కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి..

వరంగల్, ఏప్రిల్ 21: జనగామ జిల్లాలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బచ్చన్నపేట మండలంలోని చిన్న రామంచర్ల బచ్చన్నపేట ఐకేపీ కేంద్రాలను సీపీఎం పార్టీ బచ్చన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది.

ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ.. వరి కోతలు సుమారు 15 రోజుల క్రితం నుండి కోతలు కోసి ఐకేపీ కేంద్రాల్లో వడ్లను పోసి రైతులు 15 రోజులు గడిచిన వడ్లను ప్రభుత్వం కొనకపోవడం రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఐకేపీ కేంద్రాలలో ఎండలు బాగా ముదిరిన సందర్భంగా రైతులకు, హమాలీలకు టెంట్లను ఏర్పాటు చేయాలని మంచినీటి సౌకర్యం కల్పించాలని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ పార్టీ మండల కమిటీ సభ్యులు అన్నె బోయిన రాజు, బుర్రి సుధాకర్, రామగళ్ళ అశోక్, గుడికందుల నాగరాజు, బాల నరసయ్య, కనకయ్య, కర్రే రాములు, తదితరులు పాల్గొన్నారు.

# పునర్వినియోగ ఆర్థిక వ్యవస్థ దిశగా సమూల మార్పులను చూస్తున్న ప్రపంచం.. కనుమరుగవుతోన్న వ్యర్థాలు: డాక్టర్ జితేంద్ర సింగ్




న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూవిజ్ఞాన శాఖ (స్వతంత్ర బాధ్యత) సహాయ మంత్రి, ఎంఓఎస్ పీఎంఓ, సిబ్బంది, ప్రజా ఫిర్యాదుల శాఖ, పెన్షన్లు, అణుశక్తి , అంతరిక్ష యాన శాఖల సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచం పునర్వినియోగ ఆర్థిక వ్యవస్థ దిశగా సమూల మార్పును చూస్తోందన్నారు. ఆర్థిక పరంగా ఆలోచనా దృక్పథంలో నిర్ణయాత్మక మార్పు వచ్చిందని, దీని ద్వారా వ్యర్థాలు కనుమరుగవుతాయని పేర్కొన్నారు. ప్రతి నిరుపయోగ వస్తువును ఆర్థిక విలువ సృష్టించే వనరుగా చూడటం పెరుగుతోందని తెలిపారు. స్వచ్ఛతా ప్రచారంలో భాగంగా సేకరించిన ఈ-వ్యర్థాలు, పాత సామాగ్రిని విక్రయించటం ద్వారా ప్రభుత్వానికి రూ.4,000 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆయన ఉదహరించారు.

రీసైక్లింగ్, బయో టెక్నాలజీ ఆధారిత ఆవిష్కరణ తోడ్పాటుతో రూపుదిద్దుకుంటున్న ఈ పునర్వినియోగ ఆర్థిక వ్యవస్థ నమూనా వివిధ రంగాల్లో పారిశ్రామిక వృద్ధి, సుస్థిరతకు కొత్త రూపమిస్తుందని మంత్రి తెలిపారు.

వనరుల సామర్థ్యం, పునర్వినియోగ ఆర్థిక వ్యవస్థ అంశంపై న్యూఢిల్లీలో నిర్వహించిన రెండో అంతర్జాతీయ సదస్సు, అవార్డుల కార్యక్రమంలో డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ ప్రతినిధులతో పాటు యూరోపియన్, జర్మనీ రాయబార కార్యాలయ ప్రతినిధులు, రిసోర్స్ ఎఫిషియన్సీ అండ్ సర్క్యులర్ ఎకానమీ ఇండస్ట్రీ అలయన్స్‌కు చెందిన కీలక భాగస్వాములు పాల్గొన్నారు.

కొన్నేళ్లుగా పర్యావరణ సంబంధిత చర్చల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని, పర్యావరణ పరిరక్షణ దృక్పథం నుంచి దాన్ని బలమైన ఆర్థిక కోణంతో చూసే స్థాయికి మారిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. సుస్థిరత ద్వారా ఆదాయాన్ని ఆర్జించవచ్చనే అవగాహన పెరగటం వల్ల, ఈ ఉద్యమం పట్ల మరింత శ్రద్ధ పెరగటమే కాక ప్రజల భాగస్వామ్యం కూడా విస్తృతమైందన్నారు.

పారిశ్రామిక అభివృద్ధి తదుపరి దశ ఎక్కువగా పునర్వినియోగం, బయో-టెక్నాలజీ, జన్యు ఆధారిత ప్రక్రియల ద్వారా సాగుతుందని మంత్రి అన్నారు. ఈ మార్పును ప్రపంచవ్యాప్త నిపుణులు తదుపరి పారిశ్రామిక విప్లవానికి నాందిగా పరిగణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ప్రయోగాత్మక ఉదాహరణలను వివరిస్తూ.. ఒకప్పుడు వ్యర్థాలుగా భావించిన ప్లాస్టిక్, వాడిన వంట నూనె, ఉక్కు వ్యర్థాల వంటి పారిశ్రామిక ఉప-ఉత్పత్తులను ఇప్పుడు విలువైన వనరులుగా మారుస్తున్నారు. వీటిని రోడ్ల నిర్మాణం, జీవ ఇంధనాలు, వాణిజ్య పరంగా లాభదాయకమైన పారిశ్రామిక ఉత్పత్తులుగా మారుస్తున్నారు. గతంలో ఇటువంటి వ్యర్థాల నిర్వహణకు ఖర్చులు భరించిన పరిశ్రమలు.. ఇప్పుడు వాటి నుంచే ఆర్థిక లాభాలను పొందుతున్నాయని వెల్లడించారు.

నిరంతర స్వచ్ఛత, పునర్వినియోగ ప్రక్రియలు ఇప్పటికే ఎన్నో ఆర్థిక ప్రయోజనాలను చేకూరుస్తున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ప్రత్యేక దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రస్తావిస్తూ.. కేవలం ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ ద్వారానే ప్రభుత్వానికి రూ.4,000 కోట్ల ఆదాయం సమకూరిందని తెలిపారు. ఇది వనరుల పునర్వినియోగంలోని అవకాశాలకు నిదర్శనమన్నారు.

పునర్వినియోగ ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలు కేవలం పెద్ద పరిశ్రమలకే కాక.. గృహాలు, అసంఘటిత రంగాలు, అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈల వంటి ఆర్థిక వ్యవస్థలకు విస్తరిస్తాయని తెలిపారు. దీనివల్ల వివిధ స్థాయిల్లో జీవనోపాధి, వ్యాపార అవకాశాలు కలుగుతాయన్నారు.

విస్తృత స్థాయిలో మార్పునకు ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ఉమ్మడి భాగస్వామ్యం, ప్రవర్తనలో మార్పులు అవసరమని మంత్రి అన్నారు. వివిధ రంగాలను ప్రోత్సహిస్తూ, సహకారానికి ప్రభుత్వం మద్దతిస్తున్న తరుణంలో పెట్టుబడి, ఆవిష్కరణలు, భాగస్వామ్యం కోసం పరిశ్రమలు, అంకుర సంస్థలు, పౌరులు క్రియాశీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

మారుతున్న ఆర్థిక విధానాల గురించి ప్రస్తావిస్తూ.. కీలక మార్పును భారత్ చూస్తోందన్నారు. ఇందులో భాగంగా విలువ వ్యవస్థలు కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయని.. వ్యర్థాల నిర్వహణ, గ్రీన్ టెక్నాలజీస్, పునర్వినియోగ ఉత్పాదక వ్యవస్థల్లో నూతన అవకాశాలు పుట్టుకొస్తాయని అన్నారు. 2070 నాటికి కర్బన రహితంగా మారాలన్న భారత నిబద్ధతకు ఈ మార్పు దోహదపడుతుందని తెలిపారు.

భారత సంస్కృతి, వ్యవసాయ రంగాల్లో సంప్రదాయ పునర్వినియోగ ఆర్థిక వ్యవస్థ గురించి బీఐఆర్ఏసీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జితేంద్ర కుమార్ ప్రస్తావించారు. ఈ వారసత్వాన్ని ఆధునిక శాస్త్రీయ ఆవిష్కరణలతో అనుసంధానించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. గ్రీన్ టెక్నాలజీస్, సుస్థిర పరిష్కారాలపై పనిచేసేందుకు అంకుర సంస్థలకు బీఐఆర్ఏసీ నిరంతరం మద్దతిస్తుందని తెలిపారు. కార్బన్ క్రెడిట్స్ వంటి జీవనాధారిత విధానాలు, చర్యలను ప్రోత్సహిస్తుందన్నారు.

వనరుల సామర్థ్యం, భారత పునర్వినియోగ ఆర్థిక వ్యవస్థ దిశగా భారతదేశ పరివర్తనను వేగవంతం చేయటానికి విధానపరమైన వ్యవస్థలు, భాగస్వామ్యాలు, అమలు వ్యూహాలపై చర్చలు వేదికగా ఈ సదస్సు నిలిచింది.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, పకడ్బంధీగా జరగాలి : కలెక్టర్ అంకిత్



ఖమ్మం, ఏప్రిల్ 21:పంట కొనుగోళ్లకు సంబంధించి అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయొద్దని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, పకడ్బందీగా జరగాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించిన ఆయన ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడారు. అక్కడ నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి తేమశాతం గుర్తించే మీటర్ ద్వారా తనిఖీ చేశారు. ధాన్యం నాణ్యత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, పురోగతి, పెండింగ్ ధాన్యం వివరాలు తెలుసుకుని సన్న, దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడ రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారికి ఎదురయ్యే సమస్యలు తెలుసుకుని లైటింగ్, తాగునీటి వసతితో పాటు మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించేలా అధికారులను ఆదేశించారు.

పీఆర్-126 దొడ్డురకం ధాన్యం నాణ్యతపై రైతులు కలెక్టరు పలు సందేహాలు వ్యక్తం చేయగా వ్యవసాయ అధికారులతో చర్చించి పిన్ పాయింట్ డ్యామేజ్ సమస్యపై పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాల విషయంలో స్పష్టత తీసుకువచ్చి అన్నదాతలకు అన్యాయం, నష్టం కలగకుండా చూడాలన్నారు. ప్రతి రైతు నుంచి చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని, పంట కొనుగోలులో ఎవరూ నష్టపోకుండా కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా అమలుచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం కొనుగోలు రిజిస్టర్, రశీదు పుస్తకాలు పరిశీలించి నమోదు విధానాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట తాసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఏఓ శంకర్, బాబూరావు ఉన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఆకస్మిక తనిఖీ

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రభుత్వం నిర్వహించే సంక్షేమ వారంలో భాగంగా బూర్గంపహాడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, విద్య కార్యక్రమాల అమలు, పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో టాలెంట్ టెస్ట్, డ్రాయింగ్ పోటీలు పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ. వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర సదుపాయాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. పాఠశాల కిచెన్ పరిశీలించి మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించే విషయంలో శ్రద్ధ వహించాలని సూచిస్తూ స్వయంగా వంటశాలను పరిశీలించారు. తాజా కూరగాయల వినియోగం, ఆహార తయారీ, వడ్డింపులో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలపై ఆరా తీశారు.

# పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో గ్రామీణ పథకాల రక్షణకు సన్నద్ధతను బలోపేతం చేస్తున్న గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ సరఫరా వ్యవస్థలు, వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణ ధోరణులపై పడే అవకాశం ఉన్న ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని, దేశవ్యాప్తంగా ప్రధాన గ్రామీణ సంక్షేమ, మౌలిక సదుపాయాల కార్యక్రమాల అమలు నిరంతరాయంగా కొనసాగేలా చూడటానికి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సన్నద్ధత చర్యలపై సమగ్ర సమీక్షను చేపట్టింది.

గ్రామీణ జీవనోపాధి, గృహ నిర్మాణం, రోడ్ల అభివృద్ధి వాటర్‌షెడ్ కార్యక్రమాలపై పరోక్ష ప్రభావాన్ని చూపే పరిణామాలను మంత్రిత్వ శాఖ నిశితంగా పర్యవేక్షిస్తోంది. లబ్ధిదారులకు ప్రయోజనాలు నిరంతరాయంగా అందేలా చూడటం, నిధులు సకాలంలో విడుదల చేయడం, కొనసాగుతున్న పథకాలను సజావుగా అమలు చేయడం కోసం మంత్రిత్వ శాఖ ముందస్తు యంత్రాంగాలను ఏర్పాటు చేసింది.

**ఉపాధి భద్రత, వేతన మద్దతు**

ప్రతిపాదిత వీబీ-జీ రామ్ జీ చట్టం, 2025 అమలులోకి వచ్చే వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్జీఏ), 2005 పూర్తి స్థాయిలో అమలులో ఉంటుంది. గ్రామీణ కుటుంబాలకు వేతన ఉపాధి కల్పనలో ఎటువంటి అంతరాయం కలగదు.

డిమాండ్ ఆధారిత ఉపాధి, సకాలంలో వేతన చెల్లింపులతో సహా అన్ని చట్టబద్ధమైన హక్కులను ఎటువంటి తగ్గింపు లేకుండా పూర్తి స్థాయిలో కొనసాగిస్తారు. కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రస్తుత వేతన రేట్లు యథాతథంగా అమలులో ఉంటాయి.

తగినంత నగదు లభ్యతను నిర్వహించడానికి, వేతనాల పంపిణీకి ఎటువంటి అంతరాయం కలగకుండా చూసేందుకు, ఎంజీఎన్ఆర్జీఏ కింద వేతనాల కోసం సుమారు రూ. 17,744 కోట్లను మొదటి విడతగా విడుదల చేస్తున్నారు.

ఇది అమల్లోకి వచ్చిన తర్వాత, ప్రతిపాదిత వీబీజీ రామ్ జీ చట్టం 125 రోజుల వేతన ఉపాధిని మెరుగైన హామీగా కల్పిస్తుందని భావిస్తున్నారు. దీనికి సంబంధించిన సవరించిన వేతన రేట్లను విడిగా నోటిఫై చేస్తారు.

సరఫరా శ్రేణి సవాళ్లను ఎదుర్కోవడానికి గృహ నిర్మాణ కార్యక్రమం సిద్ధం

గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ ఇళ్లు అందించే లక్ష్యాన్ని సాధించేందుకు, మార్చి 2029 నాటికి 4.95 కోట్ల ఇళ్లను నిర్మించే ఉద్దేశంతో మంత్రిత్వ శాఖ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (పీఎంఏవై-జీ)ను అమలు చేస్తోంది.

సామగ్రి సరఫరాలో అంతరాయాలు లేదా ధరల హెచ్చుతగ్గుల వంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందస్తు సన్నద్ధతలో భాగంగా, మంత్రిత్వ శాఖ సకాలంలో ప్రత్యక్ష నగదు బదిలీ విడుదలకు, ఆవాస్‌సాఫ్ట్ ద్వారా నిరంతర పర్యవేక్షణకు, జియో- ట్యాగింగ్‌కు, గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి ప్రాధాన్యతనిస్తోంది.

లబ్ధిదారులకు కనీస వసతుల పూర్తి ప్యాకేజీ అందేలా చేయడానికి పని దినాలు, పారిశుధ్యం, తాగునీరు, ఎల్పీజీ, విద్యుత్ సౌకర్యాల ద్వారా బలమైన సమన్వయ మద్దతును ప్రభుత్వం అందిస్తోంది.

భవిష్యత్తులో మార్కెట్ అస్థిరతలను తట్టుకునేలా మెటీరియల్ బ్యాంకుల ఏర్పాటు వంటి నిర్మాణపరమైన చర్యలను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

పీఎమ్జీఎస్వై1, 2, 3... వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల రోడ్డు అనుసంధాన ప్రాజెక్టుల కింద మంజూరైన పనులన్నీ ఇప్పటికే టెండర్ ప్రక్రియలో లేదా నిర్మాణంలో ఉన్నాయి.

ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన-4 కింద, సుమారు 12,100 కిలోమీటర్ల రహదారి పనులను మంజూరు చేశారు. ప్రస్తుతం అవి బిడ్లను ఆహ్వానించే దశలో ఉన్నాయి. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో తారు వాటా తక్కువగా ఉండటం వల్ల, ప్రస్తుతానికి ప్రపంచ మార్కెట్ అస్థిరతల ప్రభావం పరిమితంగా ఉంది.

భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులను, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు,వ్యయ ధోరణులను ప్రతిబింబించేలా నవీకరించిన ధరల పట్టికను ఉపయోగించి మూల్యాంకనం చేస్తారు.

వ్యవసాయం, సహజ వనరుల సుస్థిరత బలోపేతానికి చర్యలు

నీటి సంరక్షణ, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, ఉద్యానవన, పచ్చిక బయళ్ల అభివృద్ధిని బలోపేతం చేయడానికి 50 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వాటర్ షెడ్ అభివృద్ధి - ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన (డబ్ల్యుడీసీ-పీ ఎంకేఎస్వై) 2.0ను భూ వనరుల విభాగం అమలు చేస్తోంది.

ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కోవడానికి, పథకాల అమలు సజావుగా సాగేలా చూడడానికి, ఈ విభాగం వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ,ఇతర భాగస్వామ్య మంత్రిత్వ శాఖలతో కలిసి సన్నిహిత సమన్వయంతో పనిచేస్తోంది.

# జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'రేస్' విద్యార్థుల ప్రతిభ




నల్గొండ, ఏప్రిల్ 21:జేఈఈ మెయిన్స్ సెషన్- 2 ఫలితాలను సోమవారం ఎన్టీఏ విడుదల చేసింది. ఈ ఫలితాల్లో కోదాడ పట్టణంలో రేస్ ఐఐటి మెడికల్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన మొక్క చరణ్ సాయి 99.56 పర్సంటైల్ సాధించి జాతీయస్థాయిలో 1,583, చిలుకూరు భాను శంకర్ 98.76 పర్సంటైల్ 5,225, ఐ.కృష్ణ చరణ్ 97.25 పర్సంటైల్ సాధించి 6,274 ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన విద్యార్థులు వివిధ కేటగిరి విభాగాల్లో గుండ్లపల్లి రమ్యశ్రీ (ఈడబ్ల్యూఎస్) 431, చింతకాయల కార్తీక్ 1,489 (ఓబిసి), బానోతు గణేష్ 6,148, ఎం.సంజీవ్ 9,132 జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారు.

కళాశాలకు చెందిన 100 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు రేస్ విద్యాసంస్థల చైర్మన్ బాణాల వసంత రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షల్లో తమ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరచడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐటీసీలో ప్రమాదం- లారీ డ్రైవర్ మృతి

ఖమ్మం, ఏప్రిల్ 21: బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో మంగళవారం లారీ ఫైర్ పైపులైనుకు తగలడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మెడకు తీవ్రగాయాలై మృతిచెందగా మరో ఇద్దరు ప్రమాదం నుండి బయటపడ్డారు. ఉదయం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఓ ట్రాన్స్‌పోర్టులో ముసలిమడుగుకు చెందిన తంబి(50) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. లారీలో పల్ప్ మెటీరియల్ తీసుకుని ఐటీసీలోని పల్ప్ యార్డులో అన్‌లోడింగ్ చేసుకుని తిరిగి బయటి వర్క్‌కు సంబంధించి వెళ్తుండగా లారీ యార్డు సమీపంలో ఉన్న ఫైర్ పైపులైనుకు లారీ బలంగా తగిలి పూర్తిగా మెల్ట్ అయింది. దీంతో ప్రధాన పైపు పగిలిపోవడంతో ఈ సంఘటనలో డ్రైవర్ కిందపడి పోవడంతో పైప్‌లైన్‌కు సంబంధించిన పైపు మెడభాగంలో తగలడంతో తెగిపోయింది. సమాచారం అందుకున్న సెక్యూరిటీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ తంబిని ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు.

# రూ.2 కోట్ల విలువైన హాష్ ఆయిల్ సీజ్.. అంతర్ రాష్ట్ర ముఠా అరెస్టు




వరంగల్, ఏప్రిల్ 21: : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ స్థాయిలో హాష్ ఆయిల్ (గంజాయి మొక్కల నుండి తీసిన నూనె) స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్, క్యాట్ పార్టీ, ఇంతేజార్గంజ్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు రూ.2 కోట్ల 50 లక్షల విలువ గల హాష్ ఆయిల్‌తో రెండు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో సీపీ సన్ ప్రీత్ సింగ్ నిందితులను అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు.

ఒడిశాకు చెందిన హంటల్ సన్ను, హంటల్ సన్యాసి, కృష్ణా హంటర్ ఏపీకి చెందిన కండల చిన్నబాబు, వరారీలో ఉన్న పాండు ముఠాగా ఏర్పడ్డారు. ప్రధాన నిందితుడు హంటల్ సన్ను స్వగ్రామంలో గంజాయి మొక్కలను పెంచుతూ వాటిని మిగితా నిందితుల ద్వారా విక్రయించేవాడు. గంజాయి విక్రయాలతో వచ్చే డబ్బు జల్సాలకు సరిపోకపోవడంతో ప్రధాన నిందితుడు గంజాయి మొక్కల నుండి హాష్ అయిల్ తయారు చేసి, పాండు సూచనల మేరకు పాండు తీసుకవచ్చిన పరికరం ద్వారా ఈ ముఠా సభ్యులు గంజాయి మొక్కల ద్వారా 40కిలోల హాష్ అయిలు సేకరించారు.

గంజాయి మొక్కల ద్వారా తయారు చేసిన హాష్ అయిల్లో 20కిలోల హాష్ అయిల్ పాండు ముఠా తీసుకోగా, మిగితా 20కిలోల హాష్ అయిలు కిలో చొప్పున ప్యాకేట్లలో భద్రపర్చి మిగితా ముఠా సభ్యులు 5 కిలోల చోవున హాష్ అయిల్ ను ముంబైలో విక్రయించేందుకు ఆంధ్రప్రదేశ్ తుని రైల్వే స్టేషన్ నుండి ఈ నెల 19 తేదీ అర్ధరాత్రి కోనార్క్ రైలులో బయలు దేరారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లుగా అనుమానం రావడంతో నిందితులను తనిఖీలు చేసి, నిందితుల నుంచి పెద్ద మొత్తంలో హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నట్లు సీపీ పేర్కొన్నారు.

# మావూరి మట్టి సింగారం పుస్తక ఆవిష్కరణ.. ఎమ్మెల్యేకు ఆహ్వానం

నల్గొండ, ఏప్రిల్ 21: డివిజన్ లోని పెద్దవంగర వాస్తవ్యులు ప్రముఖ కవి వాగ్గేయకారుడు చిలుక భాస్కర్ తాను రచించిన పెద్ద వంగర చరిత్ర ను తెలిపే మావూరి మట్టి సింగారం గ్రంథావిష్కరణకు స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని తొర్రూరులో కలిసి ఆహ్వానించారు.

తన పూర్వ గ్రంథం తూరుపువాడను అందజేశారు. ఈ సందర్భంగా చిలుక భాస్కర్ మాట్లాడుతూ తన స్వగ్రామ పెద్దవంగర పూర్వ చరిత్రతో కూడిన మావూరి మట్టి సింగారం నూతన గ్రంథమును అంకిత స్వీకారాని ఎమ్మెల్యేను కోరగా అంగీకారం తెలిపిందని, గ్రంథావిష్కరణకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని ఆహ్వానించగా సానుకూలంగా స్పందించి తమ అంగీకారాన్ని తెలియచేసినందుకు రచయిత కృతజ్ఞతలు తెలిపారన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ సామాజిక రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రాంబాబు, గుండాల నర్సయ్య చిలుక సంజీవరావు వివిధ గ్రామాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్‌సీబీని 2026వ సంవత్సరం మొదటి మూడు నెలల్లో 73 మంది మాదకద్రవ్య నేరగాళ్లకు కఠిన శిక్షలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:మాదకద్రవ్యాల నియంత్రణ బ్యూరో (ఎన్‌సీబీ) 2026లో మొదటి మూడు నెలల్లో 73 మంది నిందితులకుకి కఠిన శిక్షలు పడేలా చూసినందుకు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఎన్‌సీబీకి అభినందనలు తెలిపారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని శ్రీ అమిత్ షా పొందుపరుస్తూ, "మత్తుమందుల బారిన పడకుండా మన యువతీ యువకులను కాపాడే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా మాదక ద్రవ్య ముఠాల భరతం పడుతూ, ఆ ముఠాల్లోని వారిని దోషులుగా నిరూపిస్తోంది. ఈ ఉద్యమంలో భాగంగా... ఈ సంవత్సరం తొలి మూడు నెలల్లో 73 మంది నేరగాళ్లకు శిక్ష ఖాయమయ్యేటట్లు చూసి ఎన్‌సీబీ ఒక ముఖ్య విజయాన్ని సాధించింది. మేం సకల శక్తి యుక్తులతోనూ డ్రగ్ రాకెట్ల పీచమణచాలని నిర్ణయించుకున్నాం. ఈ ఘనవిజయాన్ని సాధించినందుకు ఎన్‌సీబీకి అభినందనలు" అని పేర్కొన్నారు.

ఈ ఏడాది తొలి త్రైమాసికంలో, అంటే జనవరి నుంచి మార్చి మధ్య, 35 కేసుల్లో 73 మంది మత్తుమందుల నేరగాళ్లను దోషులుగా ఎన్‌సీబీ నిరూపించింది. వారిలో నలుగురికి గరిష్ఠంగా 20 సంవత్సరాల శిక్షను విధించగా, మరో 54 మందికి పదేళ్లు, అంతకన్న ఎక్కువ శిక్షను విధించారు. నేరగాళ్లకు రూ.1.22 కోట్ల జరిమానాను కూడా విధించారు.

విచారణ ప్రక్రియను పర్యవేక్షించే దిశగా ఎన్‌సీబీ దృష్టిని కేంద్రీకరించడంతో, నేరనిర్ధారణ రేటు క్రమంగా పెరుగుతోంది. ఇది 2024లో 60.5 శాతంగా ఉంటే, 2026 తొలి త్రైమాసికంలో 68.6 శాతానికి వృద్ధి చెందింది.

ముఖ్య నేర నిర్ధారణల్లో 2021వ సంవత్సరం అహ్మదాబాద్ విమానాశ్రయంలో 2.757 కిలోల హెరాయిన్‌ను జప్తు చేసిన అంతర్జాతీయ హెరాయిన్ దొంగ రవాణా కేసుకు తోడు, 2022లో ఫజిల్కా ఇండో-పాక్ సరిహద్దులో 4.235 కిలోల హెరాయిన్ స్వాధీనం కేసు కూడా ఉంది. ఈ రెండు కేసుల్లో ఇద్దరు విదేశీ అక్రమ రవాణా దారులకు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షను విధించారు.

మరో కీలక నేర నిర్ధారణ 2023లో నవోదైంది. ఆ సంవత్సరంలోని కేసు స్యూడోఎఫిడ్రిన్ (దీనిని ఎన్‌డీపీఎస్ చట్టంలో నియంత్రిత పదార్థంగా ప్రకటించారు) డైవర్షన్‌కు సంబంధించింది. దీన్లో హర్యానా సోనీపత్ లోని ఆల్ఫ్స్ లైఫ్ సైన్సెస్ సంస్థకు ప్రమేయం ఉంది. ఈ కేసులో డైరెక్టరు సహా ముగ్గురు నిందితులకు 7 సంవత్సరాల కఠిన జైలు శిక్షతో పాటు తలా రూ.1.5 లక్షల జరిమానాను విధించారు. కంపెనీని కూడా దోషిగా ఖరారు చేసి, రూ.1.5 లక్షల జరిమానాను విధించారు. స్యూడోఎఫిడ్రిన్ తయారీకి కంపెనీకి ఇచ్చిన అనుమతిని కూడా ఎన్‌సీబీ వాపసు తీసుకుంది.

మాదక ద్రవ్య ముఠాలకు సంబంధం ఉండి, విచారణ జరుగుతున్న కీలక కేసుల్ని గుర్తించి ప్రభావవంతమైన విధంగా అభియోగాన్ని నిర్ధారించాల్సిందిగా ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేర నియంత్రణ సంస్థలను ఎన్‌సీబీ కోరింది. మాదర ద్రవ్య ముఠాలను చిన్నభిన్నం చేసే ఈ వైఖరి... దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా విసురుతున్న సవాలును ఎదుర్కొనే దిశగా నేర నియంత్రణ వ్యూహంలో విశేషాంశం. ఇది మత్తుమందుల దుర్వినియోగానికి వ్యతిరేకంగా ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో-టాలరెన్స్ విధానాన్ని పునరుద్ఘాటిస్తోంది.

# మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రిజర్వేషన్ లేని దివ్యాంగుల కోచ్‌లలో చెల్లుబాటు

## అయ్యే యూడీఐడీ కార్డు కలిగిన దివ్యాంగులకు ప్రయాణించే అవకాశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:అందరికీ సమానంగా ప్రయాణ సౌకర్యాలు, మెరుగైన సౌకర్యాన్ని కల్పించడంలో భాగంగా.. చెల్లుబాటు అయ్యే ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు (యూడీఐడీ) కలిగిన దివ్యాంగులు.. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వారి కోసం ప్రత్యేకంగా కేటాయించిన రిజర్వేషన్ లేని కోచ్‌లలో ప్రయాణించేందుకు భారత రైల్వేశాఖ అవకాశం కల్పించింది.

దివ్యాంగుల సాధికారత విభాగం జారీ చేసిన చెల్లుబాటు అయ్యే యూడీఐడీ కార్డులు కలిగిన దివ్యాంగులు, అలాగే భారతీయ రైల్వే ద్వారా ప్రయాణ రాయితీ సౌకర్యం ఉన్న వారు.. రైలులో దివ్యాంగుల కోసం కేటాయించిన సెకండ్ క్లాస్ లగేజ్ కమ్ బ్రేక్ వ్యాన్ విత్ కంపార్ట్‌మెంట్ ఫర్ దివ్యాంగన్ (ఎస్ఎల్ఆర్ డీ) లేదా లగేజ్ కమ్ సెకండ్ క్లాస్ లగేజ్ కమ్ బ్రేక్ వ్యాన్ విత్ కంపార్ట్‌మెంట్ ఫర్ దివ్యాంగన్ (ఎల్ఎస్ఎల్ఆర్ డీ) కోచ్‌లలో ప్రయాణించవచ్చు. అయితే వారు ఖచ్చితంగా సరైన ప్రయాణ పత్రాన్ని కలిగి ఉండాలి.

దివ్యాంగుల బోగీలలో అనధికారికంగా ప్రయాణిస్తూ పట్టుబడిన ప్రయాణికులపై రైల్వే చట్టం 1989లోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని రైల్వే శాఖ స్పష్టం చేసింది. లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఈ నదుపాయాలను వినియోగించుకునేలా చూడటమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపింది.

ఈ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని భారత రైల్వే అన్ని జోనల్ రైల్వేలను ఆదేశించింది. దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, సంబంధిత అధికారులందరూ ఈ నియమాలను ఖచ్చితంగా పాటించేలా అవసరమైన సూచనలు జారీ చేయాలని సూచించింది.

దివ్యాంగన్ కార్డు.. దీనినే ఈ టికెటింగ్ ఫోటో ఐడెంటిటీ కార్డ్ (ఈపీఐసీఎన్) అని కూడా పిలుస్తారు. ఇది రైల్వే శాఖ దివ్యాంగులకు ఇచ్చే ప్రత్యేక గుర్తింపు కార్డు. ఈ కార్డు ఉంటే రైలు టికెట్లపై వచ్చే రాయితీలను సులభంగా పొందవచ్చు. చెల్లుబాటు అయ్యే దివ్యాంగ ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఈ కార్డును జారీ చేస్తారు. అయితే కొన్ని వర్గాల వారికి యూడీఐడీ కార్డును కూడా అంగీకరిస్తారు. కొత్త కార్డు తీసుకోవాలన్నా లేదా ఉన్న కార్డును పునరుద్ధరించుకోవాలన్నా.. భారత రైల్వేకు చెందిన దివ్యాంగజన్ పోర్టల్ లేదా కేంద్ర ప్రభుత్వ సర్వీసుల పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు.

# లాలా సముందర్లాల్ పేరిట చలివేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్, ఏప్రిల్ 21: అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం లాల ముత్తునూర్ గ్రామంలో లాలా సముందర్లాల్ పేరిట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఆర్‌డీఓ (ప్రత్యేక అధికారి) రాథోడ్ రవీందర్, గ్రామ సర్పంచ్ రితే విట్టల్ మంగళవారం ప్రారంభించారు.

ఉట్నూం-ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామానికి చెందిన లాలా సముందర్లాల్ జీవించిన కాలంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, చలివేంద్రం ద్వారా ప్రజల దాహం తీర్చడంలో ముందుండేవారని స్థానికులు గుర్తుచేశారు.

ఆయన మరణానంతరం ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగించేందుకు ఆయన కుమారుడు ధృవ కుమార్ జైస్వాల్ ముందుకు వచ్చి చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మహిళా ఎస్టీ కమిషన్ సభ్యురాలు ఈశ్వరి బాయి, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, గ్రామ కారోబారి ప్రహ్లాద్ గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చదువులో రాణిస్తేనే భవిష్యత్తులో మంచి స్థానం

## -ఇన్స్పెక్టర్ మన్మధ కుమార్

ఆదిలాబాద్, ఏప్రిల్ 21:విద్యార్థులు చదువులో రాణిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందని చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ జి మన్మధ కుమార్, మండల విద్యాధికారి గురువారావు లు తెలిపారు. చౌటుప్పల్ పట్టణంలోని వివిఆర్ ఫంక్షన్



హాల్ లో మంగళవారం ట్రినిటీ హైస్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలు గా చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్, మండల విద్యాధికారి గురువారావు లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఇన్స్పెక్టర్ మన్మధ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల మనోవికాసం, అభివృద్ధికి ఇలాంటి ప్రోగ్రామ్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ఆడుతూ, పాడుతూ ఇష్టపడి చదవాలని కోరారు. ట్రినిటీ హైస్కూల్ యజమాన్యం కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తూ విద్యార్థులకు సమాజంలో ఎలా ఉండాలో సూచనలు చేస్తూ విద్యార్థి అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. మండల విద్యాధికారి గురువారావు మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే అనేది ఇంతకు ముందు యూనివర్సిటీలో ఉండేదని, ఇప్పుడు ట్రినిటీ హైస్కూల్లో కూడా గ్రాడ్యుయేషన్ డే జరపడం ఎంతో అభినందనీయమని యజమాన్యాన్ని అభినందించారు.

గ్రాడ్యుయేషన్ డే జరపడం చిన్నపిల్లల చదువు మీద మరింత శ్రద్ధ పెరిగి ఉన్నత చదువులు చదవడానికి ఆసక్తి కలిగిస్తుందన్నారు. చిన్నపిల్లలకు తల్లిదండ్రులు అన్నం తినిపించేటప్పుడు చందమామను చూపించేది కానీ నేడు సెల్ ఫోను చూపించి అన్నం తినిపిస్తున్నారు, సెల్ పోన్ లేకుండా రోజు గడవడం లేదు, తల్లిదండ్రులు పిల్లలకు సెల్ ఫోను వాడడం తగ్గించాలన్నారు. పిల్లలు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత తల్లిదండ్రులు తమ సెల్ ఫోను వాడకం తగ్గించి పిల్లలతో రోజు ఒక గంట సేపు వారితో గడిపితే పిల్లల్లో మార్పు వస్తుంది అన్నారు.

పిల్లలు చదువు పట్ల మరింత ఆసక్తి పెరిగి ఉన్నత చదువులు చదవడానికి ఆసక్తి చూపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ మండల కన్వీనర్ వెన్ రెడ్డి సంధ్యా రాజు, 7వ వార్డు కౌన్సిలర్ కానర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు, ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ డాక్టర్ ఉజ్జని మంజుల, చింతల కరుణ, వబ్బ వంశీ, బడుగు శ్రీరాములు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ప్రారంభం




నల్గొండ, ఏప్రిల్ 21:దోస్తు ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం తెలంగాణ ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ విడుదల చేసిందని, విద్యార్థుల సౌకర్యార్థం పరకాల లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వాలంటరీ హెల్ప్ లైన్ సెంటర్ ను మంజూరు చేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందగోరే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అడ్మిషన్ విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్ మల్లయ్య ను మరియు దోస్త్ టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ డి సంజయ్ కుమార్ ను 94411 21301, 9573 956412 నెంబర్లలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. ఏప్రిల్ 15 నుంచి మే 7వ తేదీ వరకు మొదటి విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకోసం రూ 200 చెల్లించాలని, ఏప్రిల్ 30వ తేదీ నుండి మే 8 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారని తెలిపారు.

మే 14వ తేదీన మొదటి విడత సీట్ల కేటాయింపు జరుగుతుందని, మే 15 నుంచి మే 25వ తేదీ వరకు రెండవ విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకోసం రూ 400 చెల్లించాలని, మే 15 నుండి మే 26 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారని, మే 30వ తేదీన రెండవ విడత సీట్ల కేటాయింపు జరుగుతుందని, మూడో విడత మే 31 నుంచి జూన్ 15 వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని, జూన్ 20వ మూడో విడత సీట్ల కేటాయింపు జరుగుతుందని, ఈ మూడు విడుతలలో సీట్లు పొందిన విద్యార్థులు అన్ లైన్ లో సెల్ఫ్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి: ఎమ్మెల్యే బొజ్జు పటేల్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21: రైతులు తమ వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బొజ్జు పటేల్ సూచించారు.

మంగళవారం కడెం మండలంలోని కల్లెడ, చిన్న బెల్లాల్ గ్రామాల్లో ఐకేపీ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు.

రైతులు దళారులను నమ్మకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, డీసీసీ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దుటూరి సతీష్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం జి. గంగాధర్, కడెం మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్ యాదవ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బరుపాటి రమేష్ వర్మ, గ్రామాల సర్పంచ్‌లు తాటి రుక్మిణి దేవి, సంజీవ్ పటేల్, బొంతల లక్ష్మి భూమన్న, బొడ్డు స్పందన గంగన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ రావు, తక్కల్ల సత్యనారాయణ, కొండాపురం లక్ష్మణ్, వాజిద్ ఖాన్, ఐకేపీ అకౌంటెంట్ లింగన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.


# సామాజిక న్యాయం పాటిస్తేనే పార్టీకి ఆధిక్యం

సంగారెడ్డి, సంగారెడ్డి, ఏప్రిల్ 21:రాబోయే స్థానిక ఎన్నికలు, కాంగ్రెస్ పార్టీ పదవులలో జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని, సామాజిక న్యాయం పాటించినప్పుడే పార్టీకి క్షేత్రస్థాయిలో తిరుగులేని విజయం లభిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ స్పష్టం చేశారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని రెడ్లాన్ హోటల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలజగ్గారెడ్డి సమక్షంలో జరిగిన ఈ భేటీలో జిల్లా రాజకీయ పరిణామాలు, ఎన్నికల వ్యూహాలపై కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఏ సామాజిక వర్గానికైనా వారి జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల ఆకాంక్షలను గౌరవిస్తూ టిక్కెట్ల పంపిణీ జరగాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.మెదక్ పార్లమెంట్ పరిధిలో పార్టీని బలోపేతం చేసేందుకు తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని, కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు దక్కాలని ఆయన కోరారు. మంత్రులు దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ పార్టీలో వర్గపోరు లేనప్పుడే పార్టీకి లాభం జరుగుతుందని అన్నారు, అందరినీ కలుపుకొని పార్టీని విజయపథంలో నడిపిస్తామని నేతలకు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో పటాన్చెరు పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షులు శశికళ యాదవ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు చిన్న ముదిరాజ్, తోపాజీ అనంత కిషన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కాట సుధ, కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ స్థానం కోసం రేవంత్ తాపత్రయం

## – కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



కరీంనగర్, ఏప్రిల్ 21: (నేటినిజం ప్రతినిధి) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్థానాన్ని దక్కించుకోవాలనే తాపత్రయంతో వ్యవహరిస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. డీలిమిటేషన్ పేరుతో దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ జమిలి ఎన్నికలు వస్తే బీజేపీ విజయం ఖాయమనే భయంతోనే రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అంగీకరించడం లేదని, ఆ స్థానాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్, డీఎంకే తదితర పార్టీలు పెద్ద తప్పు చేశాయని మండిపడ్డారు. కుటుంబ రాజకీయాల వల్లే సాధారణ మహిళలకు అవకాశాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. అమిత్ షా ప్రతిపాదించినట్లు ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచేలా డీలిమిటేషన్ చేయాలన్న ఆలోచనకు ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టించాయని పేర్కొన్నారు. జనాభా పెరుగుదల నేపథ్యంలో పార్లమెంట్ స్థానాల పెంపు అవసరమని తెలిపారు. దక్షిణాదిపై అన్యాయం పేరుతో రాజకీయ లాభం పొందాలని ప్రయత్నిస్తున్నారని, వాస్తవానికి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు.

# విద్యా కుసుమాలు - క్రమశిక్షణ ముళ్లు: మారుతున్న కాలం.. మారుతున్న చట్టాలు

పాఠశాలలు కేవలం పాఠ్యాంశాల బోధనకు మాత్రమే పరిమితం కాకుండా వ్యక్తిత్వ నిర్మాణానికి, సామాజిక బాధ్యతాభావం పెంపొందించడానికి కీలక కేంద్రాలుగా భావించబడు తున్నాయి. ఈ సందర్భంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ అనే అంశం ఎప్పటికీ ప్రాముఖ్యత కోల్పోని మూల్యంగా నిలిచింది. అయితే క్రమశిక్షణ పేరుతో ఉపాధ్యాయులు తీసుకునే చర్యలు ఎంతవరకు చట్టబద్ధం, ఎంతవరకు నైతికంగా సమర్థించదగినవి అన్నది కాలక్రమేణా పెద్ద చర్చా విషయంగా మారింది. తాజాగా కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ చర్చకు మరో కొత్త మలుపు నిచ్చింది. విద్యార్థిని క్రమశిక్షణలో పెట్టేందుకు ఉపాధ్యాయుడు బెత్తంతో కొట్టిన ఘటనలో నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేస్తూ కోర్టు చేసిన వ్యాఖ్యలు విద్యా రంగం, న్యాయ వ్యవస్థ, మానవ హక్కుల వర్గాల్లో విస్తృత చర్చకు దారితీశాయి.

తిరువనంత పురంలోని ఒక పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటనలో విద్యార్థి అశ్రద్ధగా ప్రవర్తించాడనే కారణంతో ఉపాధ్యాయుడు స్టాఫ్ రూమ్‌లో బెత్తంతో కొట్టాడని ఆరోపణలు వచ్చాయి. దీనిపై పోలీసులు భారతీయ న్యాయ సంహిత (ఃఔా) మరియు జువైనల్ జస్టిస్ (ఏఏ) చట్టాల కింద కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్లు సాధారణంగా పిల్లలపై హింస, వేధింపుల కేసుల్లో ఉపయోగించబడే కఠినమైన నిబంధనలు. అయితే ఈ కేసులో ఉపాధ్యాయుడు తన చర్య క్రమశిక్షణ కోసమే జరిగిందని, దానిలో ఎటువంటి క్రూర ఉద్దేశం లేదని వాదిస్తూ హైకోర్టును ఆశ్రయించాడు.

కేసును విచారించిన ధర్మాసనం కొన్ని కీలక అంశాలను పరిశీలించింది. మొదటగా, విద్యార్థికి తలెత్తిన గాయాల తీవ్రత. మెడికల్ రిపోర్టుల ప్రకారం విద్యార్థి శరీరంపై ఎటువంటి గంభీర గాయాలు లేవని తేలింది. ఇది కేసు తీవ్రతను తగ్గించే ప్రధాన అంశంగా కోర్టు పరిగణించింది. రెండవది, ఘటన జరిగిన వెంటనే కాకుండా కొన్ని రోజుల తర్వాత ఆసుపత్రికి వెళ్లడం. దీనిని కోర్టు అనుమానాస్పదంగా భావించింది. మూడవది, ఉపయోగించిన సాధనం?'బెత్తం'. చట్టపరంగా ఇది ప్రమాదకరమైన ఆయుధం కాదని కోర్టు స్పష్టం చేసింది.

ఈ అంశాలన్నింటినీ సమీక్షించిన తరువాత కోర్టు 'మెన్స్ రియా' అనే న్యాయ సూత్రాన్ని ప్రస్తావించింది. అంటే నేరం జరగాలంటే కేవలం చర్య మాత్రమే కాకుండా దాని వెనుక నేరపూరిత ఉద్దేశం కూడా ఉండాలి. ఈ కేసులో ఉపాధ్యాయుడి చర్య క్రమశిక్షణ పరిరక్షణ కోసమే జరిగిందని, దానిలో క్రూరత్వం లేదా ద్వేషభావం కనిపించలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. అందువల్ల ఈ చర్యను నేరంగా పరిగణించడం సబబు కాదని పేర్కొంది.

ఈ తీర్పు ద్వారా కోర్టు మరో ముఖ్యమైన అంశాన్ని స్పష్టం చేసింది. ఉపాధ్యాయులకు విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచేందుకు కొంత పరిమిత అధికారాన్ని చట్టం అనుమతిస్తుందని పేర్కొంది. అయితే ఈ అధికారం అపరిమితం కాదు. అది సదుద్దేశంతో, సమంజసమైన పరిమితుల్లో, క్రూరత్వం లేకుండా వినియోగించబడాలి. ఈ సూత్రం ద్వారా కోర్టు ఒక సున్నితమైన సమతుల్యతను సూచించింది?విద్యార్థుల హక్కులను కాపాడుతూ ఉపాధ్యాయుల పాత్రను పరిరక్షించడం.

ఇక్కడ ఒక విస్తృత సామాజిక నేపథ్యాన్ని



పరిశీలించడం అవసరం. భారతదేశంలో శారీరక శిక్ష (ఇనీతీజూనీతీజీశ్రీ జూబీనితిబష్ట్రవనిబి) పై చట్టపరమైన దృక్కోణం గత కొన్ని దశాబ్దాల్లో గణనీయంగా మారింది. ఒకప్పుడు "బెత్తం బుద్ధి చెబుతుంది'' అనే భావన సాధారణంగా అంగీకరించబడేది. కానీ పిల్లల హక్కులపై అవగాహన పెరగడంతో ఈ దృక్కోణం మారింది. 2009లో అమలులోకి వచ్చిన విద్యా హక్కు చట్టం (ఖీతిణష్ట్రబి బినీ ఇటబీఇ-జీబితినీని ఏఇ-బి) ప్రకారం పాఠశాలల్లో శారీరక శిక్షను నిషేధించారు. అలాగే జువైనల్ జస్టిస్ చట్టం కూడా పిల్లలపై హింసను కఠినంగా శిక్షిస్తుంది.

నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఔఅఖఅఖీ) నివేదికల ప్రకారం భారతదేశంలో ఇంకా అనేక పాఠశాలల్లో శారీరక శిక్ష కొనసాగుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థుల్లో సుమారు 60 శాతం వరకు ఎప్పుడో ఒకసారి శారీరక శిక్షను అనుభవించినట్లు వెల్లడైంది. ఇది చట్టం ఉన్నప్పటికీ అమలులో లోపాలు ఉన్నాయని చూపిస్తుంది.

ఈ నేపథ్యంలో కేరళ హైకోర్టు తీర్పు ఒక కీలక ప్రశ్నను లేవనెత్తుతోంది?శారీరక శిక్షను పూర్తిగా నిషేధించిన చట్టాల నేపథ్యంలో "పరిమిత శారీరక చర్య"కు స్థానం ఉందా? కోర్టు ఇచ్చిన తీర్పు పూర్తిగా శారీరక శిక్షకు మద్దతు ఇవ్వలేదు. కానీ ప్రతి సందర్భాన్ని దాని ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా పరిశీలించాలని సూచించింది. ఇది ఒక రకంగా 'సందర్భానుసార న్యాయం' (ఇ-నీనిబివలీబిబీజీశ్రీ తీబీబబితిఇ-వ) భావనకు దగ్గరగా ఉంటుంది.

ఇంకొక కోణంలో చూస్తే, ఈ తీర్పు ఉపాధ్యాయులపై పెరుగుతున్న చట్టపరమైన ఒత్తిడిని కూడా ప్రతిబింబిస్తుంది. గతంలో క్రమశిక్షణ పేరుతో తీసుకున్న చర్యల వల్ల అనేక ఉపాధ్యాయులు కేసుల్లో ఇరుక్కుపోయిన సందర్భాలు ఉన్నాయి. దీని వల్ల పాఠశాలల్లో క్రమశిక్షణ అమలు చేయడంలో ఉపాధ్యాయులు వెనుకడుగు వేస్తున్నారని విద్యా నిపుణులు అంటున్నారు. కేరళ హైకోర్టు తీర్పు ఈ భయాన్ని కొంతవరకు తగ్గించే ప్రయత్నంగా కూడా చూడవచ్చు.

అయితే ఈ తీర్పుపై విమర్శలు కూడా లేకపోలేదు. పిల్లల హక్కుల కోసం పోరాడే సంస్థలు ఈ నిర్ణయం ప్రమాదకర సందేశాన్ని పంపవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. "సదుద్దేశం" అనే పదం సబ్జెక్టివ్‌గా ఉండటం వల్ల దాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఒక ఉపాధ్యాయుడు తన చర్యను సదుద్దేశంతో చేశానని చెప్పడం ద్వారా శారీరక శిక్షను సమర్థించుకునే పరిస్థితి రావచ్చని విమర్శిస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఒక సమగ్ర దృక్కోణం అవసరం. విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించడం అనివార్యం. కానీ దానికి ఉపయోగించే పద్ధతులు సమకాలీన విలువలకు అనుగుణంగా ఉండాలి. సైకాలజీ పరిశోధనలు చూపిస్తున్నట్లుగా, శారీరక శిక్ష తాత్కాలికంగా ప్రవర్తనను నియంత్రించగలిగినా దీర్ఘకాలంలో భయం, ఆత్మవిశ్వాస హీనత, ఆగ్రహం వంటి ప్రతికూల ప్రభావాలు కలిగిస్తుంది. అందువల్ల సానుకూల క్రమశిక్షణ (జూనీబతిబితిలవ టతిబఇ-తిజూశ్రీతినివ), ప్రవర్తనా మార్పు పద్ధతులు, కౌన్సెలింగ్ వంటి మార్గాలు ఎక్కువగా ప్రోత్సహించ బడుతున్నాయి.

కేరళ హైకోర్టు తీర్పు ఒక చట్టపరమైన స్పష్టతను అందించినప్పటికీ, ఇది విద్యా వ్యవస్థలో ఉన్న విభిన్న సవాళ్లను కూడా వెలుగులోకి తీసుకొచ్చింది. క్రమశిక్షణ మరియు మానవ హక్కుల మధ్య సమతుల్యత ఎలా సాధించాలి అన్న ప్రశ్నకు ఇది తుది సమాధానం కాదు, కానీ ఒక దిశను సూచించే ప్రయత్నం మాత్రమే. భవిష్యత్తులో ఈ అంశంపై మరింత స్పష్టమైన మార్గదర్శకాలు, ఉపాధ్యాయులకు శిక్షణ, పాఠశాల స్థాయిలో నియంత్రణ వ్యవస్థలు అవసరం అవుతాయి.

అంతిమంగా విద్య అంటే కేవలం నియంత్రణ కాదు, మార్గనిర్దేశం. శిక్ష అంటే భయం కాదు, అవగాహన. ఈ విలువలను ప్రతిబింబించే విధంగా విద్యా వ్యవస్థ రూపుదిద్దుకున్నప్పుడే సమాజం నిజమైన అర్థంలో అభివృద్ధి చెందుతుంది.



**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
9440595494

# అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు

**- పారదర్శకంగా మైనారిటీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక**
**-మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 21:(నేటినిజం ప్రతినిధి): ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మార్గదర్శకంలో



అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తుర్క కాశ కమ్యూనిటీ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మున్సిపల్ అధికారులతో కలిసి పారదర్శకంగా నిర్వహించారు.ప్రభుత్వం అందజేసే టూల్‌కిట్లు, జనరేటర్ల కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అండదండలతో నియోజకవర్గంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన మార్గదర్శకంలోనే అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనాలు అందుతున్నాయని స్పష్టం చేశారు.మున్సిపల్ పరిధి నుంచి మొత్తం 64 మంది దరఖాస్తు చేసుకోగా, నిర్వహించిన ఇంటర్వ్యూలకు 37 మంది హాజరైనట్లు వివరించారు. తుర్క కాశ కమ్యూనిటీకి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ పరికరాల పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి పేదవాడికి న్యాయం చేస్తామని, ఎంపిక ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.ఎమ్మెల్యే నాయకత్వంలో వేములవాడ నియోజకవర్గాన్ని సంక్షేమంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పుల్కం రాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ భూలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, కమ్యూనిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి దేవాలయంలో చోరీ

ఖమ్మం, ఏప్రిల్ 21: చుంచుపల్లి మండలంలోని ధన్బాద్ పంచాయతీ పరిధిలో ఉన్న పోచమ్మ తల్లి దేవాలయంలో జరిగిన చోరీ, విగ్రహ ధ్వంసం ఘటన స్థానికంగా తీవ్ర కలకలాన్ని రేపింది. కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ దేవాలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడి తలుపుల తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం హుండీని పగలగొట్టి నగదు దోచుకెళ్లడమే కాకుండా, అమ్మవారి విగ్రహం ఎడమచేయిని ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న టూ టౌన్ సీఐ డి.ప్రతాప్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలను సేకరించారు. నిందితులను త్వరలో పట్టుకుని కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. నిత్యం జనసంచారం ఎక్కువగా ఉండే జాతీయ రహదారి పక్కనే ఉన్న దేవాలయంలో ఇలాంటి ఘటన జరగడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఐఐటీ-జేఈఈ (మెయిన్)-2026 ఫలితాలలో అల్ఫోర్స్ సత్తా

**-1000లోపు 14 ర్యాంకులు**




కరీంనగర్, ఏప్రిల్ 21:(నేటినిజం ప్రతినిధి) ఐఐటీ-జేఈఈ (మెయిన్)?2026 ఫలితాలలో అల్ఫోర్స్ ఐఐటీ అకాడమీ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. జాతీయ స్థాయిలో అగ్ర ర్యాంకు లు సాధించి ర్యాంకుల పంట కోశారు. ఈ ఫలితాల్లో ఎం. శ్రీపార్థీష్ 29వ ర్యాంక్‌తో అగ్రస్థానంలో నిలిచాడు. సి.హెచ్. లక్ష్మీహాసిని (116), సి.హెచ్. పూర్ణచంద్ (138), ఎస్. వర్షినిరెడ్డి (211), ఎన్. రత్నప్రకాశ్ (239), పి. అక్షయ (250), ఎ. కీర్తన (274) ర్యాంకులు సాధించారు. యు. సిద్ధేశ్వర్ (459), కె. ధనుష్ (556), కె. నచికేత్ (593), బి. లిఖిత్సాయి (737), యమ్. వశిష్ట (884), కె. ప్రజ్ఞాన్ (991), రెడ్డి శ్రీకర్ (1000) ర్యాంకులతో మెరిశారు.మొత్తంగా 1000లోపు 14 ర్యాంకులు, 2000లోపు 18 ర్యాంకులు, 5000లోపు 35 ర్యాంకులు సాధించడం విశేషం. 450 మంది విద్యార్థులు ఐఐటీ-అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు.విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, పటిష్ట ప్రణాళికల ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అల్ఫోర్స్ చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి తెలిపారు. రాబోయే ఐఐటీ-అడ్వాన్స్‌డ్‌లో కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తమిళనాడులో ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం.. మూగబోయిన మైకులు

తమిళనాడు, ఏప్రిల్ 21: తమిళనాడు లో అసెంబ్లీ ఎన్నికల పోరు క్లైమాక్స్‌కు చేరుకుంది. హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం మంగళవారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఏప్రిల్ 23న (బుధవారం) అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. రాష్ట్రంలోని మొత్తం 234 నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ప్రచారానికి ఆఖరి రోజున ప్రధాన పార్టీలన్నీ రోడ్ షోలు, బహిరంగ సభలతో హోరెత్తించాయి. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన కోలత్తూరు నియోజకవర్గంలో ప్రచారాన్ని ముగించగా.. విపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి ఎడప్పాడిలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ సర్వం సిద్ధం చేసింది. సుమారు 5.6 కోట్ల మంది ఓటర్లు తమ తీర్పును వెల్లడించనున్నారు. ఈసారి ఎన్నికలు కేవలం డీఎంకే, ఏఐఏడీఎంకే మధ్యే కాకుండా త్రిముఖ పోరును తలపిస్తున్నాయి. ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం తొలిసారి బరిలోకి దిగడం రాజకీయ సమీకరణాలను మార్చేసింది. విజయ్ స్వయంగా పెరంబూరు నుంచి పోటీ చేస్తుండటంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఆయన చేసిన ప్రచారానికి యువత, మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ఏ పార్టీతో నూ పొత్తు లేకుండా ఒంటరిగా బరిలోకి దిగిన విజయ్.. అటు డీఎంకే, ఇటు ఏఐఏడీఎంకే ఓటు బ్యాంకుకు గండి కొడతారనే చర్చ నడుస్తోంది.

అధికార డీఎంకే కూటమి తమ ద్రవిడ మోడల్ పాలన, సంక్షేమ పథకాలను నమ్ముకుని ప్రచారం నిర్వహించింది. మరో వైపు బీజేపీతో మళ్లీ జతకట్టిన ఏఐఏడీఎంకే ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని అస్త్రాలుగా చేసుకుని విమర్శలు గుప్పించింది. ప్రధాని నరేంద్ర మోదీ పలుమార్లు తమిళనాడులో పర్యటించి ఎన్డీయే అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించగా.. రాహుల్ గాంధీ కూడా డీఎంకే కూటమికి మద్దతుగా సభల్లో పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా ఒకరిపై ఒకరు చేసుకున్న వ్యక్తిగత విమర్శలు, సవాళ్లతో తమిళనాడులో రాజకీయ వాతావరణం హీట్‌గా మారింది.

# దక్షిణాదికి విస్తరించిన లివ్‌లాంగ్ 365 బీమా సంస్థ

హైదరాబాద్, ఏప్రిల్ 21: భారతదేశపు ప్రముఖ బీమా, సమగ్ర హెల్త్-టెక్ ప్లాట్‌ఫామ్ అయిన లివ్‌లాంగ్ 365 సంస్థ తన కొత్త కార్యాలయాన్ని హైదరాబాద్ లో ప్రారంభించినట్లు ప్రకటించింది. సోమాజిగూడలోని రాజ్‌భవన్ రోడ్‌లో ఉన్న ఈ కార్యాలయం ద్వారా ఆరోగ్య సంరక్షణ, బీమా పరిష్కారాలను పరిధిమేరా నిజాయితీ నిబద్ధతతో ప్రజలకు అందించాలని భావిస్తున్నట్లు తెలిపింది.

సంస్థ విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం ద్వారా కీలక పట్టణ మార్కెట్లలో తన ఆఫ్‌లైన్ ఉనికిని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉంది. దీనిద్వారా సమగ్ర ఆరోగ్య సంరక్షణ, వెల్నెస్, బీమా సేవలను వినియోగదారులకు, కార్పొరేట్‌లకు, భాగస్వాములకు మరింత చేరువ చేస్తుంది. డిజిటల్ ఆవిష్కరణ, క్షేత్రస్థాయి ఆరోగ్య సంరక్షణల మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చే లివ్‌లాంగ్ ప్రయాణంలో హైదరాబాద్ కార్యాలయం ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది.హైదరాబాద్‌లోని అత్యంత రద్దీగా ఉండే నివాస, వాణిజ్య కేంద్రాలలో ఒకదానిగా వ్యూహాత్మకంగా ఈ కార్యాలయం నెలకొని ఉంది.

# రైతుల వరి ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించాలి

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు**



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 21:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మరియు పట్టణ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామంతో పాటు వట్టెంల, ఫాజుల్‌నగర్, నమిలిగుండుపల్లె, చెక్కపల్లి, ఆచ్చన్నపేట, వెంకటంపల్లి, నూకలమర్రి, మర్రిపల్లి, హనుమాజీపేట, బొల్లారం, మల్లారం గ్రామాలలో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా మరియు సజావుగా నిర్వహిస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ మరియు, మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ డైరెక్టర్లు, ఖమ్మం గణేష్ శంకర్ పర శరం సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లు, సంగస్వామి కరుణాకర్ వార్డు సభ్యులు, వివిధ విభాగాల అధ్యక్షులు, రైతులు, మహిళలు, యువకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్సాహంగా కరాటే గ్రేడింగ్ టెస్ట్

**-ట్రినిటీ, బిర్లా ఓపెన్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ**

కరీంనగర్, ఏప్రిల్ 21:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్‌సాలెహ్‌నగర్‌లోని ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ఘనంగా జరిగింది. ట్రినిటీ, బిర్లా ఓపెన్ మైండ్స్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. విజయవంతంగా పరీక్ష ఉత్తీర్ణులైన విద్యార్థులకు కరాటే, తైక్వాండోలో తదుపరి బెల్ట్ స్థాయికి పదోన్నతి కల్పించారు. ప్రిన్సిపాల్, అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె వసంత్ కుమార్ (బ్లాక్ బెల్ట్ 8వ డాన్) చేతుల మీదుగా బెల్టు, సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా ట్రినిటీ విద్యా సంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి, ఛైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, డైరెక్టర్ డా. దాసరి మమత రెడ్డి విద్యార్థులను అభినందించారు.ఛైర్మన్ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కరాటే ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు.ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల ఏకాగ్రతను పెంచి ఆరోగ్యకర జీవనశైలిని అలవాటు చేస్తుందని చెప్పారు.చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వసంత్ కుమార్ మాట్లాడుతూ కరాటే స్వీయరక్షణతో పాటు గౌరవం, పట్టుదలను నేర్పే జీవన విధానమని పేర్కొన్నారు. కార్యక్రమం విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది.




# రిటైర్మెంట్ ప్లానింగ్‌లో భారతీయుల వెనుకడుగు

**- ఇండియా రిటైర్మెంట్ ఇండెక్స్ స్టడీ 5.0 వెల్లడి**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:రిటైర్మెంట్ ప్లానింగ్ అవసరం తెలిసినా, దానిని ఆచరణలో పెట్టడంలో భారతీయులు వెనుకబడి ఉన్నారని ఇండియా రిటైర్మెంట్ ఇండెక్స్ స్టడీ (ఐఆర్ఐఎస్) 5.0 అధ్యయనం వెల్లడించింది. ద్రవ్యోల్బణం, ఆరోగ్య ఖర్చుల పెరుగుదల, ఆర్థిక ప్రణాళిక లోపంతో భవిష్యత్తు భద్రతపై ఆందోళన పెరుగుతుంది. భారతీయ ఉద్యోగి 'నడిచే ఎన్సైక్లోపీడియా'లాగా ఉన్నాడు. కానీ రిటైర్మెంట్ సిద్ధత మాత్రం బలహీనంగా ఉంది. యాప్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టడం, గ్లోబల్ మార్కెట్ ట్రెండ్స్‌పై చర్చించడం మనకు సులభమే. కానీ ముప్పై సంవత్సరాల తర్వాతి భవిష్యత్తును ఊహించాలంటే ఒక మానసిక మబ్బు కమ్ముకుంటుంది. రిటైర్మెంట్ ప్లానింగ్ అవసరమని ఒప్పుకుంటూ, ఆచరణలో మాత్రం దానిని 'తక్షణ అవసరం కాని విలాసం'గా చూస్తున్నాం. దీన్ని తగ్గించడం ఇప్పుడు కేవలం ఆర్థిక లక్ష్యం మాత్రమే కాదు, మన వ్యక్తిగత గౌరవానికి కూడా అవసరం. భారతీయ కుటుంబాల్లో చాలా మంది 'ఆప్టిమిజం బైయాస్'కు లోనవుతుంటారు. అంటే అన్నీ బాగానే జరిగిపోతాయి. భవిష్యత్తులో ఒక పెద్ద ఆదాయం వస్తుంది అన్న నమ్మకం. ఈ కారణంగా భవిష్యత్తు కోసం దాచాల్సిన డబ్బును, ప్రస్తుత అవసరాల కోసం అనగా పెళ్లిళ్లు, పిల్లల విదేశీ విద్య కోసం మళ్లిస్తుంటారు.

NEXT KEY
COMMUNICATIONS
Azam Khan
ph no: 9848343882, 6303093338

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**